RNI:APTEL/2023/87729

# పెన్ సత్తా

ప్రశ్నించడం అందరి హక్కు...

PEN SATTA Telugu Daily

సంపుటి : 4 సంచిక :130 ఎడిటర్ : చింతమనేని అనిల్ కుమార్ ఆదివారం 27 సెప్టెంబర్ 2026 పేజీలు : 08 వెల : 03

Published from Vishakapatnam Circulated by Vijayawada, Ongole, Chittoor, Kadapa, Tirupati. Nandyal, Hyderabad, Ananthapur, Kurnool



విలేకరులు కావలెను

పెన్ సత్తా తెలుగు దినపత్రిక

ఆంధ్రప్రదేశ్ అన్ని జిల్లా లకి పెన్ సత్తా దినపత్రికలో పనిచేయుటకు జిల్లా స్టాఫ్ రిపోర్టర్లు, నియోజకవర్గ ఇంచార్జ్ లు, మండల రిపోర్టర్లు కావలెను. వార్తలు పెట్టే వారికే ప్రాధాన్యత.

ఫోన్ నెం : 9885315759






## గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ వేలో

# ట్విన్ టన్నెల్స్

- 2 అడుగుల వెడల్పు - 32 అడుగుల ఎత్తు
- విజయవాడ-కడప-బెంగుళూరు ఎకనామిక్ కారిడార్‌ను కలుపుతూ ఉమ్మడి ప్రకాశం జిల్లా మీదుగా నిర్మిస్తున్న గ్రీన్ ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ వే పనులు జెట్‌స్పీడ్‌లో జరుగుతున్నాయి
- ఇలాంటి అద్భుతమైన గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ వేలో ట్విన్ టన్నెల్స్ మరో వండర్.


అమరావతి

విజయవాడ-కడప-బెంగుళూరు ఎకనామిక్ కారిడార్‌ను కలుపుతూ ఉమ్మడి ప్రకాశం జిల్లా మీదుగా నిర్మిస్తున్న గ్రీన్ ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ వే పనులు జెట్‌స్పీడ్‌లో జరుగుతున్నాయి. ఇలాంటి అద్భుతమైన గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ వేలో ట్విన్ టన్నెల్స్ మరో వండర్. వివరాలు 2లో..

## ఈసీ ప్రకటనతో అపోహలకు

# తెరపడింది

- ఎన్నికల కమిషనర్ల మధ్య విభేదాలంటూ ప్రచారం
- ఢిల్లీలో కీలక సమావేశంతో క్లారిటీ ఇచ్చిన ఈసీ
- తమ మధ్య విభేదాలు లేవంటూ సంయుక్త ప్రకటన విడుదల
- సోషల్ మీడియాలో స్పందించిన ఏపీ సీఎం చంద్రబాబు
- రాజ్యాంగ సంస్థల సమగ్రతను, విశ్వసనీయతను గౌరవించాలని పిలుపు
- గెలుపోటములను హుందాగా స్వీకరించడమే నాయకత్వ లక్షణమని ఉద్ఘాటన




అమరావతి

భారత ఎన్నికల సంఘం (ఈసీఐ)లో కమిషనర్ల మధ్య విభేదాలు తలెత్తాయంటూ వచ్చిన వార్తలపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పందించారు. ఇవాళ ఓ కీలక సమావేశం సందర్భంగా ఈసీ ఇచ్చిన ఏకగ్రీవ ప్రకటనతో అన్ని అపోహలకు తెరపడిందని ఆయన పేర్కొన్నరు. మన రాజ్యాంగ సంస్థల సమగ్రతను, విశ్వసనీయతను ఈ ప్రకటన మరోసారి స్పష్టం చేసిందని ఎక్స్ వేదికగా శనివారం ఆయన పేర్కొన్నారు. ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ అంశంపై నెలకొన్న వివాదం తాజాగా ఈసీ వివరణతో ముగిసిందని తెలిపారు.స్వల్పకాలిక రాజకీయ ప్రయోజనాల కోసం భారత ప్రజాస్వామ్య వ్యవస్థ, ఎన్నికల ప్రక్రియలపై ప్రజల్లో ఉన్న విశ్వాసాన్ని దెబ్బతీసే ప్రయత్నాలు చేయడం దురదృష్టకరమని చంద్రబాబు అభిప్రాయపడ్డారు. ఎన్నికల ఫలితాలు ప్రజల తీర్పును ప్రతిబింబిస్తాయని, వివరాలు 2లో..



## ఫారం-6లో చట్ట, రాజ్యాంగ

# విరుద్ధమైన మార్పులు

- సీఈసీ ఉద్దేశపూర్వకంగానే ఇలా చేశారు
- సీఈసీ జ్ఞానేష్ కుమార్‌పై కాంగ్రెస్ ఆగ్రహం
- ఫారం 6లో ఆయన చట్ట, రాజ్యాంగ విరుద్ధమైన మార్పులు చేశారని మండిపాటు
- ఓటరు నమోదు ప్రక్రియలో ఈసీ చేసిన మార్పులతో జెన్‌జీ ఓటర్లకు ఆటంకాలు ఏర్పడ్డాయని ఆరోపణలు

## నాగాలాండ్‌లో కల్తీ మద్యం కలకలం..

- రెండు రోజుల్లో 19 మంది మృతి
- ఘటనపై సిట్ దర్యాప్తు ప్రారంభం
- మద్యం నమూనాలు ఫోరెన్సిక్ పరీక్షలకు తరలింపు
- 19 మందిని అరెస్టు చేసిన పోలీసులు
- దాదాపు 3 వేల బాటిళ్ల స్వాధీనం
- అనుమానిత మద్యం సేవించొద్దని పోలీసుల హెచ్చరిక






## 'సర్' నోటీసులు.. అత్యవసరమైతే తప్ప వ్యక్తిగత విచారణకు రానక్కర్లేదు

- నోటీసులు అందుకున్నవారు బీఎల్‌వోను కలవక్కర్లేదు.. బీఎల్‌వోలే ఓటర్లక ఇళ్లకు వస్తారు
- రాత్రి షెల్టర్లు, కార్మికులు, పేదలు, నిరాశ్రయుల కోసం డీఈవోలు సహాయ కేంద్రాలు, స్పెషల్ క్యాంపులు ఏర్పాటు చేయాలి
- ఎస్ఐఆర్ కాకుండా ఇతర సమయాల్లో సాధారణ నియమాల ప్రకారం ఫామ్‌లు వాడాలి
- ఈసీఐనెట్‌ను సీనియర్ డీఈసీ అధ్యక్షతన కమిటీ సమీక్షిస్తుంది
- ఎస్ఐఆర్ 20 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో పూర్తయింది
- ఓటర్లు, యువకులు కంటిన్యూయస్ అప్‌డేషన్ ద్వారా పేరు చేర్చుకోవచ్చు

## పరవాడ ఫార్మా కాలుష్యంపై

# పవన్ కల్యాణ్ సీరియస్



- 95 కంపెనీలకు నోటీసులు
- ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఆదేశాలతో ఫార్మాసిటీపై పీసీబీ చర్యలు
- సోషల్ మీడియా ఫిర్యాదు ఆధారంగా కాలుష్యంపై తనిఖీలు
- పరవాడలోని 95 ఫార్మా పరిశ్రమలకు షోకాజ్ నోటీసులు జారీ
- వ్యర్థాల నిర్వహణపై పరిశ్రమలకు కీలక దిద్దుబాటు చర్యల ఆదేశం

అమరావతి


సోషల్ మీడియాలో వచ్చిన ఒక ఫిర్యాదుపై రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ తక్షణమే స్పందించారు. ఆయన ఆదేశాలతో అనకాపల్లి జిల్లా పరవాడ ఫార్మాసిటీలోని 95 పరిశ్రమలకు ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి (ఏపీపీసీబీ) షోకాజ్ నోటీసులు జారీ చేసింది. శుద్ధి చేయని వ్యర్థాలను వర్షపు నీటి కాలువల్లోకి విడుదల చేస్తూ కాలుష్యానికి కారణమవుతున్నారన్న ఆరోపణలపై ఈ చర్యలు తీసుకుంది. వివరాల్లోకి వెళితే, పరవాడ ఫార్మాసిటీ సమీపంలోని డ్రెయిన్లలో వివరాలు 2లో..



## పార్లమెంట్‌లో ఎస్సీ, ఎస్టీ ఎంపీలకు మరింత సమయం ఇవ్వండి

- లోక్‌సభ స్పీకర్‌కు జితిన్ రామ్ మాంజీ లేఖ
- సభలో కీలక బిల్లులపై చర్చ జరిగే సమయంలో ఎస్సీ, ఎస్టీలకు అదనపు సమయం ఇవ్వాలన్న మాంజీ
- తమ సామాజిక వర్గానికి తగినంత సమయం అవసరమన్న మాంజీ
- తమ అభ్యర్థనను సీరియస్‌గా పరిగణించాలని విన్నపం

# పేదలకు పట్టాభిషేకం





- ఈ నెల 30న చంద్రబాబు చేతుల మీదుగా పట్టాలు
- ఈ నెల 30న విజయవాడలో ఇళ్ల క్రమబద్ధీకరణ పట్టాల పంపిణీ
- 24,057 కుటుంబాలకు సంపూర్ణ యాజమాన్య హక్కులు
- రూ.9800 కోట్ల విలువైన భూములపై పేదలకు అధికారం
- దశాబ్దాల నాటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపిన కూటమి ప్రభుత్వం
- 8 నియోజకవర్గాల్లోని లబ్దిదారులకు ప్రయోజనం

అమరావతి

పేదలకు పూర్తిస్థాయి యాజమాన్య హక్కులు కల్పించే బృహత్తర కార్యక్రమంలో భాగంగా కూటమి ప్రభుత్వం మరో ప్రతిష్ఠాత్మక ఘట్టానికి శ్రీకారం చుట్టింది. దశాబ్దాలుగా నగరవాసులను వేధిస్తున్న ఇళ్ల పట్టాల సమస్యకు శాశ్వత పరిష్కారం చూపే దిశగా కీలక ముందడుగు వేసింది. విశాఖపట్నంలో ఇటీవల విజయవంతంగా నిర్వహించిన 'పేదలకు పట్టాభిషేకం' కార్యక్రమ స్ఫూర్తితో, ఇప్పుడు విజయవాడలో భారీ ఎత్తున ఇళ్ల క్రమబద్ధీకరణ పట్టాల పంపిణీకి సిద్ధమైంది. ఈ నెల 30వ తేదీన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా 24,057 కుటుంబాలకు సంపూర్ణ హక్కులతో కూడిన పట్టాలను అందించనున్నారు. విజయవాడలో ప్రతి ఎన్నికల్లోనూ ప్రధాన అజెండాగా మారుతున్న ఇళ్ల పట్టాల సమస్యకు కూటమి సర్కార్ చరమగీతం పాడుతోంది. దశాబ్దాల క్రితం అందించిన ఎన్టీఆర్ పట్టాలకు చట్టబద్ధత వివరాలు 2లో..

# పండగల సీజన్‌లో బంగారం కొనొద్దు

- ప్రధాని మోదీ విజ్ఞప్తి ఫలిస్తుందా?
- బంగారం కొనుగోళ్లు తగ్గించాలని భారతీయులకు ప్రధాని మోదీ మరోసారి పిలుపు
- విదేశీ మారక ద్రవ్యం ఆదా చేసేందుకే ఈ విజ్ఞప్తి
- పండగల సీజన్‌లో ఈ పిలుపునకు స్పందనపై ఉత్కంఠ
- వినాయక చవితికి 15 శాతం మేర తగ్గిన బంగారం అమ్మకాలు
- పెట్టుబడికి భౌతిక బంగారం కన్నా ఈటీఎఫ్‌లు మేలంటున్న నిపుణులు



# గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ వేలో ట్విన్ టన్నెల్స్

-మొదటిపేజీ తరువాయి

కనిగిరి మండలం వంగపాడు వద్ద కొండను తొలుస్తూ 350 మీటర్లు ఏర్పాటు చేస్తున్న రెండు సొరంగ మార్గాలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. 52 అడుగుల వెడల్పు 32 అడుగుల ఎత్తున టన్నెల్స్ నిర్మిస్తున్నారు. విజయవాడ వైపు వెళ్లే దారిలో 300 మీటర్లు, బెంగుళూరు వెళ్లే వైపు మార్గంలో వంద మీటర్ల మేర నిర్మాణం పూర్తయింది. పై గోడల నుంచి మట్టి పెళ్లలు విరిగి పడకుండా ఎప్పటికప్పుడు యంత్రాల సాయంతో కాంక్రీట్‌తో లైనింగ్ చేస్తున్నట్లు మేఘా కంపెనీ ప్రతినిధులు తెలిపారు. అడవిలో కొండల నడుమ సొరంగ మార్గాలు కనువిందు చేస్తున్నాయి. ఈ ఎక్స్‌ప్రెస్ వే పూర్తయితే ఇప్పటివరకు 12 గంటలు పాటు పట్టే ప్రయాణ సమయం ఇకపై ఆరు గంటలు మాత్రమే పడుతుంది. ఈ ప్రాజెక్టు పూర్తయితే కనిగిరి ప్రాంతం పారిశ్రామికంగా, వాణిజ్యపరంగా మరింత అభివృద్ధి చెందే అవకాశం ఉంది.

**342.24 కిలోమీటర్ల గ్రీన్‌ఫీల్డ్ హైవే**

అయితే బెంగళూరు నుంచి విజయవాడ వరకు నేరుగా వెళ్లేందుకు కొత్తగా ఎలాంటి ప్రత్యేక రోడ్డేమీ నిర్మించడం లేదు. బెంగళూరు నుంచి శ్రీసత్యసాయి జిల్లాలోని కొడికొండ చెక్‌పోస్ట్‌కు సమీపంలో గల కోడూరు వరకు వెళ్లాల్సి ఉంటుంది. ప్రస్తుతం అందుబాటులో ఉన్న బెంగళూరు-హైదరాబాద్ హైవేలో 110 కిలోమీటర్లు మేర ప్రయాణించాల్సి వస్తుంది. కోడూరు వద్ద యాక్సెస్ కంట్రోల్ గ్రీన్‌ఫీల్డ్ హైవే మొదలై, 343.24 కిలోమీటర్లు కొనసాగి ప్రకాశం జిల్లాలోని ముప్పవరం వద్ద చెన్నై-కోల్‌కతా రహదారిలో కలుస్తుంది. అక్కడి నుంచి చెన్నై-కోల్‌కతా రహదారిలో 115 కిలోమీటర్లు ప్రయాణించి విజయవాడకు చేరుకోవాలి. అంటే మధ్య 342.24 కిలోమీటర్లు గ్రీన్‌ఫీల్డ్ హైవే ఉంటుంది. దానికి అటూ ఇటూ ఇప్పుడున్న హైవేల్లో 225 కిలోమీటర్లు ప్రయాణించాల్సి ఉంటోంది.



**పనులు జరుగుతున్న తీరిది :**

ఈ రహదారి శ్రీసత్యసాయి జిల్లాలో చిలమత్తూరు, గోరంట్ల, ఓడీసీ, పుట్టపర్తి, నల్లమాడ, ముదిగుబ్బ మీదుగా తలుపుల మండలంలోని నామాలగుండు వద్ద వైఎస్సార్ కడప జిల్లాలోకి ప్రవేశిస్తుంది. ఈ 75 కి.మీ.లో 60 శాతానికి పైగా పనులు పూర్తయ్యాయి. పుట్టపర్తి మండలం సాతర్లపల్లి పరిధిలో కొండను తొలిచే పనులు నెమ్మదిగా సాగుతున్నాయి. నల్లమాడ నుంచి మలకవేముల క్రాస్ వరకు 15 కి.మీ. మేర రహదారి పూర్తయింది. మలకవేముల క్రాస్ వద్ద రైల్వే బ్రిడ్జి పనులు కొనసాగుతున్నాయి. మలకవేముల క్రాస్ నుంచి కొండగట్టుపల్లి వరకు బీటీ లేయర్ వేస్తున్నారు. వైఎస్సార్ కడప జిల్లాలో వేముల, పులివెందుల, ఎర్రగుంట్ల, కమలాపురం, చాపాడు, మైదుకూరు, పోరుమామిళ్ల మీదుగా ఈ హైవే వెళ్తోంది. కమలాపురం మండలం కంచెన్నగారిపల్లె వద్ద పెన్నా నదిపై, చాపాడు మండలం అల్లాడుపల్లి వద్ద కుందూ నదిపై భారీ వంతెనల నిర్మాణం, మిగిలిన ప్రాంతాల్లో రోడ్ల పనులు జరుగుతున్నాయి. ఈ జిల్లాలో కొన్నిచోట్ల భూసేకరణ సమస్యలతో పనులు జాప్యమవుతున్నాయి. ఉమ్మడి ప్రకాశం జిల్లా అత్యధికంగా 140 కి.మీ. ఉంది. సింగరాయకొండ నుంచి మైదుకూరు వైపు వెళ్లే ఎన్‌హెచ్-167బీ వద్ద ఇంటర్ ఛేంజ్ పనులు చేస్తున్నారు. మర్రిపూడి నుంచి సోమవరప్పాడు వరకు 13వ ప్యాకేజీలో పనులు చాలావరకు పూర్తయ్యాయి. ఈ ప్రాజెక్ట్‌లో 5.31 కి.మీ. మేర ఏడు సొరంగాలు నిర్మిస్తున్నారు. నెల్లూరు జిల్లా సీతారామపురం మండల సరిహద్దులోని 3.67 కి.మీ. పొడవైన సొరంగం ప్రాజెక్ట్‌లో అతి పెద్దది.

# అంబటి రాంబాబును వెంటాడుతున్న ఈడీ..!

**గుంటూరు :** వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో జరిగినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న ఏపీ మద్యం రవాణా టెండర్ల కుంభకోణం కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ దర్యాప్తును మరింత వేగవంతం చేసింది. ఈ కేసు దర్యాప్తులో భాగంగా వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత, మాజీ జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబుకు ఈడీ అధికారులు నోటీసులు జారీ చేశారు. హైదరాబాద్‌లోని ఈడీ ప్రాంతీయ కార్యాలయంలో జరిగే విచారణకు హాజరు కావాలని అధికారులు ఆయనకు స్పష్టం చేశారు.మద్యం రవాణా కేసులో అంబటి రాంబాబును విచారణ సెగ గట్టిగానే వెంటాడుతోంది. ఈ వ్యవహారంలో ఈడీ అధికారులు ఇప్పటివరకు ఆయనకు రెండుసార్లు నోటీసులు జారీ చేశారు. మొదటగా సెప్టెంబర్ 18న అంబటి రాంబాబుకు తొలిసారిగా ఈడీ నోటీసులు వెళ్లాయి. సెప్టెంబర్ 24న తమ ముందు హాజరుకావాలని అధికారులు అందులో పేర్కొన్నారు. అయితే ఆ సమయంలో తాను ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నానని, పాత తేదీలతో ఉన్న నోటీసులు పంపారంటూ అంబటి రాంబాబు పేర్కొన్నారు.చట్టపరమైన సలహా తీసుకునేందుకు వీలుగా తనకు కొత్త నోటీసు ఇవ్వాలని ఆయన కోరారు. అంబటి రాంబాబు అభ్యర్థన మరియు మునుపటి గడువు ముగిసిన నేపథ్యంలో, ఈడీ అధికారులు సెప్టెంబర్ 24న మరోసారి నోటీసులు జారీ చేశారు. సెప్టెంబర్ 25న ఉదయం 10.30 గంటలకు హైదరాబాద్‌లోని ఈడీ కార్యాలయంలో విచారణకు హాజరు కావాలని అధికారులు స్పష్టం చేశారు. మద్యం డిపోల నుండి షాపులకు మద్యం రవాణా చేసే కాంట్రాక్టును దక్కించుకున్న కొంతమంది వైఎస్సార్‌సీపీ నేతలతో మాజీ మంత్రికి అత్యంత



సన్నిహిత సంబంధాలు ఉన్నాయనే ఆరోపణలు వచ్చాయి.ఒకవేళ విచారణ పేరిట ఈడీ కఠిన చర్యలు తీసుకోవడం గానీ, అరెస్టు చేయడం గానీ చేస్తే.. దాన్ని రాజకీయ కక్షసాధింపుగా చిత్రీకరించి విక్టిమ్ కార్డ్ ఉపయోగించాలనేది ఆయన ఆలోచనగా కనిపిస్తోంది. కేంద్రంలో ఉన్న పవర్, విచారణ సంస్థల వద్ద లభించిన దస్త్రాల ఆధారంగా చట్టపరంగా ముందుకెళ్తున్న ఈడీపై ఇలా రాజకీయ రంగు పూయడం ద్వారా కేసు తీవ్రతను తగ్గించేందుకు ప్రయత్నిస్తున్నారు. అయితే, రాజ్యాంగబద్ధమైన కేంద్ర దర్యాప్తు సంస్థల పనితీరును, వారి వద్ద ఉన్న పక్కా మనీ-ట్రయల్ ఆధారాలను తక్కువ అంచనా వేయడం వల్లే అంబటి ఈ తరహా గేమ్స్ ఆడుతున్నారనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.ఆరోగ్య నెపంతో సమయం దాటవేసే రాజకీయాలు ఎంతో కాలం నిలబడవు. బ్యాంకు లావాదేవీలు, డిజిటల్ సాక్ష్యాలు, బినామీల వాంగ్మూలాలు ఇప్పటికే ఈడీ చేతిలో ఉన్నందున తప్పించుకునే ప్రయత్నాలు ఆయనకు మరిన్ని చిక్కులు తెచ్చిపెట్టే అవకాశాలు ఉన్నాయి. ఈడీ బిగించే ఆర్థిక చక్రబంధం ముందు రాజకీయ ప్రదర్శనలు, ప్రెస్ మీట్లు పనిచేయవని, చట్టబద్ధమైన ప్రక్రియకు హాజరై తన తాను చెప్పే 90 ఎంఎల్ కథలు నిరూపించుకోకపోతే టెండర్ల నిబంధనలను ఉల్లంఘించి, ప్రభుత్వం నిర్దేశించిన రవాణా రేట్లను భారీగా పెంచడం ద్వారా కోట్ల రూపాయల నిధులు దారిమళ్లాయనే కోణంలో దర్యాప్తు జరుగుతోంది. ఈ క్రమంలోనే గత కొన్ని సంవత్సరాలుగా జరిగిన వ్యక్తిగత బ్యాంక్ లావాదేవీల వివరాలు, ఆస్తుల పత్రాలతో సహా విచారణకు రావాలని ఈడీ అధికారులు అంబటి రాంబాబును ఆదేశించారు. ఇప్పటికే ఈ కేసులో పలువురు కీలక వ్యక్తులను అరెస్ట్ చేసిన ఈడీ, అంబటి రాంబాబు విచారణ ద్వారా మరిన్ని కీలక రహస్యాలను ఛేదించాలని భావిస్తోంది.

# ప్రతిష్టాత్మకంగా ఎన్నికలు తీసుకుంటున్న జనసేన

**విశాఖపట్టణం :** ఆంధ్రప్రదేశ్‌లో త్వరలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికలను జనసేనపార్టీ అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. క్షేత్రస్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేయడంతో పాటు, కూటమి భాగస్వామ్య పక్షాలతో పక్కా సమన్వయం కోసం ఐదుగురు సభ్యులతో కూడిన ఒక ప్రత్యేక కమిటీని జనసేన అధినేత, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఏర్పాటు చేశారు. ఎన్నికల వేళ గ్రౌండ్ లెవెల్‌లో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా పక్కా వ్యూహంతో ముందుకు వెళ్లేందుకు ఈ నిర్ణయం తీసుకున్నారుఈ కొత్త కమిటీ ఇప్పటికే జనసేన పార్టీలో క్రియాశీలకంగా ఉన్న 14 మంది సభ్యుల ప్రధాన కమిటీతో కలిసి సంయుక్తంగా పని చేయనుంది. ఈ ఐదుగురు సభ్యుల కమిటీ రాష్ట్రవ్యాప్తంగా క్షేత్రస్థాయిలో విస్తృతంగా పర్యటించనుంది. వివిధ జిల్లాల్లో పార్టీ బలాబలాలు, డివిజన్లు మరియు స్థానిక సంస్థల వారీగా అభ్యర్థుల గెలుపు అవకాశాలు, పొత్తుల సమన్వయంలో ఎదురవుతున్న సవాళ్లపై లోతుగా అధ్యయనం చేసి ఈ ప్రత్యేక టీమ్ ఒక సమగ్ర నివేదికను సిద్ధం చేయనుంది.ఈ కమిటీలు క్షేత్రస్థాయి నుంచి సేకరించి సమర్పించే నివేదికల ఆధారంగా జనసేన అధినేత పవన్ కల్యాణ్ పార్టీ సీనియర్ నేతలతో కలిసి ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించనున్నారు. ఆ నివేదికల ఆధారంగానే స్థానిక సంస్థల ఎన్నికల్లో జనసేన అనుసరించాల్సిన రాజకీయ వ్యూహాలు, సీట్ల సర్దుబాట్లపై పవన్ కల్యాణ్ క్యాడర్‌కు దిశానిర్దేశం చేయనున్నారు. మున్సిపల్, కార్పొరేషన్ ఎన్నికల వేళ సీట్ల పంపకాలపై కూటమిలో అంతర్గత చర్చలు నడుస్తున్న తరుణంలో జనసేన ఈ ప్రత్యేక కమిటీని రంగంలోకి దించడం రాజకీయ వర్గాల్లో ప్రాధాన్యత సంతరించుకుంది.స్థానిక సంస్థల ఎన్నికలు జనసేన పార్టీ నాయకత్వానికి ఒక సవాల్ గా మారాయి. ఇన్నాళ్లూ ఓపిక పట్టిన నేతలు ఎంతకాలం నుంచో ఈ ఎన్నికల కోసం కాచుక్కూర్చుని ఉన్నారు. పవన్ కల్యాణ్ పై అభిమానంతో పార్టీ జెండాను పట్టుకుని వదలకుండా పన్నెండేళ్ల నుంచి చేతబూనిన వారు ఈ ఎన్నికల్లో ఖచ్చితంగా



పోటీ చేయాలని భావిస్తున్నారు. పవన్ కల్యాణ్ కూడా సీట్ల షేరింగ్ లో రాజీ పడబోమని చెప్పడం కొంత ఊరట నిచ్చే అంశమే. అయితే చివరకు సీట్ల షేరింగ్ విషయంలో పవన్ కల్యాణ్ కు పెద్ద సమస్య గా మారనుంది. సీట్ల షేరింగ్ ఎక్కువ అడిగితే వాటిని ఖచ్చితంగా గెలిపించుకోవాలి. తగ్గించుకుంటే ప్రత్యర్థులే కాకుండా సొంత పార్టీ నేతల నుంచి కూడా ప్యాకేజీ అంటూ కామెంట్స్ చేస్తారు. రాజీ పడకుండా.. రహదారి ఏంటి? అన్నదే పవన్ కల్యాణ్ ముందున్న ప్రశ్న. ఏ నిర్ణయమైనా పవన్ కల్యాణ్ కు ఈ ఎన్నికలు పెద్ద సమస్యగా మారాయని చెప్పాలి. ఆంధ్రప్రదేశ్ స్థానిక సంస్థల ఎన్నికల్లో సీట్ల సర్దుబాటు విషయంలో జనసేన అధినేత, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ చాలా స్పష్టమైన, దూకుడు వైఖరిని ప్రదర్శిస్తున్నారు. కాకినాడలో జరిగిన పార్టీ కీలక సమావేశంలో ఆయన చేసిన వ్యాఖ్యలు కూటమి రాజకీయాల్లో పెద్ద చర్చకు దారితీశాయి.ప్రపంచ పటాలు పరిశీలించండి 2024 అసెంబ్లీ ఎన్నికల సమయంలో బీజేపీని కూటమిలోకి తెచ్చే క్రమంలో టీడీపీ అభ్యర్థన మేరకు జనసేన సీట్లు తగ్గించుకుంది. కానీ, స్థానిక సంస్థల ఎన్నికల్లో మళ్లీ సీట్లు తగ్గిస్తామంటే ఒప్పుకునేది లేదని పవన్ కళ్యాణ్ తేల్చి చెప్పారు. చేసిన త్యాగాలు చాలని, సీట్ల కేటాయింపులో ఎలాంటి రాజీ పడబోమని స్పష్టం చేశారు. స్నేహపూర్వక పోటీకైనా సిద్ధమని ప్రకటించడం ఇప్పుడు సరికొత్త రాజకీయాలకు తెరలేపినట్లయింది. పొత్తుల లెక్కల్లో భాగంగా ఎక్కడైనా స్థానిక నాయకత్వాల మధ్య ఏకాభిప్రాయం కుదరకపోతే, కొన్ని స్థానాల్లో స్నేహపూర్వక పోటీ కి వెడదామని క్యాడర్‌కు దిశా నిర్దేశం చేశారు. అంటే ఒకరకంగా టీడీపీకి పరోక్షంగా వార్నింగ్ ఇచ్చిన పవన్ కల్యాణ్ అదే సమయంలో స్థానికంగా కూటమి నేతల మధ్య సయోధ్యను కుదుర్చుకోవాల్సిన బాధ్యత మీదేనంటూ లోకల్ లీడర్లపై పవన్ నెట్టేయడం కూడా ఒక రకంగా చర్చకు దారి తీసింది. ఒకే వార్డులో కూటమిలోని రెండు పార్టీలు పోటీ పడాల్సి వచ్చినా వెనకడుగు వేయొద్దని కార్యకర్తలకు ధైర్యం చెప్పారు. అదే సమయంలో కూటమి ధర్మం పాటించాలని పిలుపు నిచ్చారు. గత ఐదేళ్లలో ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొని నిలబడిన గ్రౌండ్ లెవల్ కార్యకర్తలను, వీరమహిళలను ఈ ఎన్నికల ద్వారా బలోపేతం చేయాలనేది పవన్ ప్రధాన లక్ష్యం. 15 శాతం సీట్లు మాత్రమే జనసేనకు ఇస్తారంటూ వస్తున్న ప్రచారాన్ని ఆయన కొట్టిపారేశారు.వంద శాతం స్ట్రయిక్ రేట్ లక్ష్యంగా పనిచేయాలని పార్టీకి బలమున్న ప్రతి చోటా అభ్యర్థులను నిలబెట్టాలని, అసెంబ్లీ ఎన్నికల తరహాలోనే స్థానిక ఎన్నికల్లో కూడా 100 శాతం విజయాల రేటును నమోదు చేయాలనే వ్యూహంతో ముందుకు వెళ్తున్నారు.ఎన్నికల సన్నద్ధత, వ్యూహాల కోసం ప్రత్యేక కమిటీని నియమించారు. ప్రచార కమిటీ బాధ్యతలను మంత్రి కందుల దుర్గేష్‌కు అప్పగించారు. మీరు అన్నట్లుగానే పవన్ కళ్యాణ్ తాజా స్పీచ్‌ను బట్టి చూస్తే, స్థానిక సంస్థల ఎన్నికల్లో జనసేన పార్టీ తన ఆత్మగౌరవాన్ని, క్యాడర్ ప్రయోజనాలను పణంగా పెట్టి సీట్ల విషయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ వెనక్కి తగ్గే సూచనలు కనిపించడం లేదు. మరి చివరకు ఏం జరుగుతుందన్నది చూడాలి.

## ఈసీ ప్రకటనతో అపోహలకు తెరపడింది

-మొదటిపేజీ తరువాయి

బలమైన ప్రజాస్వామ్యంలో గెలుపును, ఓటమిని సమానంగా, హుందాగా స్వీకరించడమే నిజమైన నాయకత్వ లక్షణమని హితవు పలికారు. రాజ్యాంగ సంస్థలను గౌరవించడం అత్యంత ముఖ్యమని, భారత ప్రజాస్వామ్య ప్రక్రియపై ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టడం పార్టీలకు అతీతంగా నాయకులందరి ఉమ్మడి బాధ్యత అని ఆయన గుర్తుచేశారు.

**సంయుక్త ప్రకటనతో వివాదానికి ముగింపు**

కాగా, గత కొద్ది రోజులుగా తమ మధ్య తీవ్ర విభేదాలు ఉన్నాయంటూ వస్తున్న ఊహాగానాలకు భారత ఎన్నికల సంఘం పూర్తిస్థాయి కమిషన్ శనివారం తెరదించింది. ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్, ఎన్నికల కమిషనర్లు సుఖ్బీర్ సింగ్ సంధు, వివేక్ జోషి న్యూఢిల్లీలోని నిర్వాచన్ సదన్‌లో సమావేశమయ్యారు. అనంతరం ముగ్గురూ కలిసి ఉన్న ఫోటోతో పాటు ఒక సంయుక్త ప్రకటనను విడుదల చేశారు. కమిషన్ అంతర్గత పనితీరు, ఓటర్ల జాబితా సవరణ, సాంకేతిక వ్యవస్థలపై వస్తున్న ఆరోపణలను తీవ్రంగా ఖండించారు.

**వివాదానికి నేపథ్యం ఇదే..**


ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణకు సంబంధించిన పలు నిర్ణయాలపై కమిషనర్లు సంధు, జోషి అభ్యంతరాలు వ్యక్తం చేశారంటూ సెప్టెంబర్ 23న ఓ ప్రముఖ ఆంగ్ల పత్రికలో కథనం ప్రచురితమైంది. ఈ కథనం దేశవ్యాప్తంగా రాజకీయ దుమారం రేపింది. ప్రతిపక్ష పార్టీలు ఎన్నికల సంఘం పనితీరుపై సందేహాలు వ్యక్తం చేస్తూ, మరింత పారదర్శకత అవసరమని డిమాండ్ చేశాయి. ఈ నేపథ్యంలోనే పూర్తిస్థాయి కమిషన్ సంయుక్తంగా స్పందించి, తమ మధ్య ఎలాంటి విభేదాలు లేవని స్పష్టం చేసింది. రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ కోసం 2025 జూన్ 24న జారీ చేసిన ఆదేశాలను ముగ్గురు కమిషనర్లు ఏకగ్రీవంగా ఆమోదించారని ఈసీ తన ప్రకటనలో పేర్కొంది. ఆ తర్వాత కార్యక్రమ షెడ్యూళ్లను కూడా ఏకాభిప్రాయంతోనే విడుదల చేశామని తెలిపింది. ఈ ఆదేశాలను సుప్రీంకోర్టు సైతం సమర్థించిందని గుర్తుచేసింది. నిర్ణయాలన్నీ సమష్టిగా, సంస్థాగత విధివిధానాలను అనుసరించే తీసుకుంటామని కమిషన్ స్పష్టం చేసింది.

## పరవాడ ఫార్మా కాలుష్యంపై పవన్ కల్యాణ్ సీరియస్..

-మొదటిపేజీ తరువాయి

నల్లటి రంగులో, దుర్వాసనతో కూడిన నీరు ప్రవహిస్తున్నట్లు శుక్రవారం ఇన్‌స్టాగ్రామ్‌లో ఒక వీడియో పోస్ట్ అయింది. ఈ వీడియో ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ దృష్టికి వెళ్లడంతో, వెంటనే క్షేత్రస్థాయిలో విచారణ జరిపి వాస్తవాలపై సమగ్ర నివేదిక ఇవ్వాలని ఆయన పీసీబీ అధికారులను ఆదేశించారు. డిప్యూటీ సీఎం ఆదేశాలతో రంగంలోకి దిగిన పీసీబీ అధికారులు, వీడియోలో కనిపించిన ప్రాంతాల్లో తనిఖీలు చేపట్టారు. నమూనాలను సేకరించి పరిశీలించగా, శుద్ధి చేయని వ్యర్థ జలాలు వర్షపు నీటి కాలువల్లోకి చేరుతున్నట్లు ప్రాథమికంగా గుర్తించారు. దీనికి బాధ్యులుగా ఫార్మాసిటీలోని మొత్తం 95 కంపెనీలకు షోకాజ్ నోటీసులు జారీ చేసి, ఏడు రోజుల్లోగా వివరణ ఇవ్వాలని ఆదేశించారు. కేవలం నోటీసులు ఇవ్వడమే కాకుండా, కాలుష్య నివారణకు పలు కఠినమైన దిద్దుబాటు చర్యలను కూడా పీసీబీ తప్పనిసరి చేసింది. పరిశ్రమల ప్రాంగణంలోనే వర్షపు నీటిని నిల్వ చేయాలని, కలుషిత నీటిని బయటకు వదలరాదని స్పష్టం చేసింది. వ్యర్థాల నిర్వహణను డిజిటలైజ్ చేయాలని, తేదీ, సమయంతో సహా రికార్డ్ చేసే సీసీటీవీ కెమెరాలను ఏర్పాటు చేసి ఫుటేజీని ఆరు నెలల పాటు భద్రపరచాలని సూచించింది. ఆన్‌లైన్ మానిటరింగ్ వ్యవస్థతో కూడిన స్క్రబ్బర్లను వాడాలని, పర్యావరణ అనుమతుల నిబంధనలను కచ్చితంగా పాటించాలని ఆదేశాల్లో పేర్కొంది. నిర్ణీత సమయంలో సంతృప్తికరమైన సమాధానం ఇవ్వని, అక్రమంగా వ్యర్థాలను విడుదల చేస్తున్నట్లు తేలిన పరిశ్రమలపై పర్యావరణ పరిరక్షణ చట్టాల ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని పీసీబీ హెచ్చరించింది. తీసుకున్న చర్యలపై ఒక సమగ్ర నివేదికను ఉప ముఖ్యమంత్రి కార్యాలయానికి పంపినట్లు అధికారులు తెలిపారు

## విజయవాడలో 'పేదలకు పట్టాభిషేకం'




-మొదటిపేజీ తరువాయి

కల్పిస్తూ, వాటిపై లబ్ధిదారులకు పూర్తి యాజమాన్య హక్కులను కట్టబెడుతోంది. ఈ కార్యక్రమం ద్వారా సుమారు రూ. 9,800 కోట్ల విలువైన 617 ఎకరాల భూమిపై పేద, మధ్య తరగతి కుటుంబాలకు అధికారం లభించనుంది. దీనివల్ల ఒక్కో కుటుంబానికి సుమారు రూ. 40 లక్షల నుంచి రూ. 45 లక్షల వరకు లబ్ధి చేకూరనుంది. ముఖ్యంగా, విజయవాడ నగరంలోని మూడు నియోజకవర్గాల పరిధిలో కొండలపై ఇళ్లు నిర్మించుకున్న వారి చిరకాల స్వప్నం ఈ కార్యక్రమంతో నెరవేరబోతోంది. తమ ఇళ్లకు శాశ్వత భద్రత, భవిష్యత్తుకు భరోసా కల్పించాలని కొండ ప్రాంత నివాసితులు ఎన్నో ఏళ్లుగా డిమాండ్ చేస్తున్నారు. ఇటీవల జరిగిన జిల్లా ప్రజాప్రతినిధుల సమావేశంలోనూ ఎన్టీఆర్ జిల్లాకు చెందిన ప్రతినిధులు ఈ అంశాన్ని ప్రత్యేకంగా ప్రస్తావించారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా ప్రభుత్వం వేగంగా స్పందించి, ఇప్పుడు 29.86 లక్షల చదరపు గజాల స్థలంపై లబ్ధిదారులకు సంపూర్ణ హక్కులు కల్పిస్తోంది. క్రమబద్ధీకరణ చేస్తున్న భూముల మార్కెట్ విలువ దాదాపు రూ. 24,297 కోట్లుగా ఉంటుందని అంచనా. ఈ పట్టాల పంపిణీ ద్వారా ఎన్టీఆర్ జిల్లాలోని ఏడు, కృష్ణా జిల్లాలోని గన్నవరం సహా మొత్తం 8 నియోజకవర్గాల్లోని 15 మండలాల ప్రజలకు ప్రయోజనం చేకూరనుంది. సామాజిక వర్గాల వారీగా చూస్తే బీసీలు 12,093, ఓసీలు 6,130, ఎస్సీలు 4,546, ముస్లిం బీసీలు 955, ఎస్టీలు 333 కుటుంబాలు ఈ పథకం ద్వారా లబ్ది పొందనున్నాయి.

**నియోజకవర్గాల వారీగా లబ్దిదారుల సంఖ్య:**

విజయవాడ (తూర్పు) - 7,990, విజయవాడ (పశ్చిమం) - 7,465, విజయవాడ (సెంట్రల్) - 5,815, గన్నవరం - 602, జగ్గయ్యపేట - 1,135, మైలవరం - 981 నందిగామ - 54 తిరువూరు - 15

# ప్రకృతి వ్యవసాయం పై రైతులు దృష్టి సారించాలి




**నక్కపల్లి, పెన్ సత్తా, సెప్టెంబర్ 26:**ప్రకృతి వ్యవసాయం పై రైతులు దృష్టి సారించాలని ఏపీ సి ఎన్ ఫ్ జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ సి హెచ్ లచ్చన్న అన్నారు. నక్కపల్లి మండలం కాగిత, గోడిచర్ల గ్రామాలలో శనివారం అయన ప్రకృతి వ్యసాయ సిబ్బందితో కలసి పర్యటించారు. ఈ సందర్భంగా వరి రైతులు ను కలిసి ప్రకృతి వ్యవసాయ పద్ధతుల గురించి పలు విషయాలు రైతులకు వివరించారు. వరి నారు లేని రైతులకు విత్తన గుళికలు చేసి చూపించి వాటిని ఎలా వినియోగించు కోవాలో వివరించి చెప్పడం జరిగింది. తేలుకు పాటి వరి రకాలు వేసుకోవాలని, ఎక్కువగా ఎద పద్ధతిలో సాగు చేసుకోవడం ద్వారా పెట్టుబడులు తగ్గుతాయని తెలిపారు. కాగితలో ఆయనే స్వయంగా వరి నాట్లు ఎలా వేయాలి అనే విషయాలు చేసి చూపించారు.వరి నాట్లు వేసిన పొలాల్లోని అజోల్లా వేసి వాటి యొక్క ఉపయోగాలు గురించి చెప్పడం జరిగింది. అజోల్లా వేయడం వలన పంటల్లో కలుపు నివారింణ జరుగుతుందన్నారు.ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పోతంశెట్టి రాజేష్, రైతులు బాబ్జి,ప్రకృతి వ్యవసాయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఏ ఎం ఎన్ ఎస్ భూ నిర్వాసితుల పరిహారం చెల్లించాలి



**లేదంటే పనులు అడ్డుకుంటాం**

**వైసిపీ నేత వీసం రామకృష్ణ**

**నక్కపల్లి, పెన్ సత్తా, సెప్టెంబర్ 26:**పాయకరావుపేట నియోజకవర్గం నక్కపల్లి మండలం ఏ ఎమ్ ఎన్ స్టీల్ ప్లాంట్,బల్క్ డ్రగ్ పరిశ్రమ లకు భూములు ఇచ్చిన రైతుల పరిహారం తక్షణమే చెల్లించాలని వైస్సార్ సి పీ రాష్ట్ర కార్యదర్శి వీసం రామకృష్ణ డిమాండ్ చేశారు. దీనిలో భాగంగా శనివారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం లో నిర్వాసితులతో కలసి వినతి పత్రం అందజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్టీల్ ప్లాంట్ లో భూములు కోల్పోయిన కొంత మంది రైతులకు ఇంతవరకు ఆర్ ఆర్ ప్యాకేజీ, సాగు రైతులకు పరిహారం,ఆడ పిల్లలకు ప్యాకేజీలు ఇవ్వలేదన్నారు. అలాగే చందనాడ లో ఒక సామజిక వర్గం వారికి సాగులో ఉన్న భూములకు పరిహారము ఇంకా ఇవ్వలేదని దీనిపై ఎన్ని సార్లు ప్రభుత్వ అధికారులకు విన్నవించిన ఫలితం లేదన్నారు.నిర్వాసితులకు సాగుదారులకు, ఆడపిల్లల ప్యాకేజి అందజేసి స్టీల్ ప్లాంట్ పనులు చేసుకోవాలని లేని పక్షం లో పనులు అడ్డుకుంటామని హెచ్చరించారు. ఈ సందర్బంగా నక్కపల్లి తహసీల్దార్ కు వినతిపత్రం అందజేశారు.ఈ కార్యక్రమం లో వైసీపీ మండల అధ్యక్షులు గొర్ల గోవిందు, చందనాడ సర్పంచ్ భార్గవ్, ఎంపీటీసీ తిరుతిరావు, భూ నిర్వశితులు ఉన్నారు.

# ధర్మవరంలో ఘనంగా మెగా ఉచిత వైద్య శిబిరం

- బీఎస్ఆర్ బాలికల ఉన్నత పాఠశాలలో మెగా మెడికల్ క్యాంపు నిర్వహణ
- 16 రకాల వైద్య పరీక్షలు,చికిత్సలు ఉచితంగా అందించిన వైద్య బృందం
- నిరుపేద కుటుంబాలకు ఉచిత వైద్య సేవలు ఎంతో ప్రయోజనం: న్యాయవాది సుమలత
- ప్రజలు ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని సూచన



**ధర్మవరం,సెప్టెంబర్ 26 (పెన్ సత్తా)**శ్రీ సత్యసాయి జిల్లా ధర్మవరం పట్టణంలోని బీఎస్ఆర్ బాలికల ఉన్నత పాఠశాలలో శనివారం మెగా మెడికల్ క్యాంపును నిర్వహించారు. ఇంటర్నేషనల్ ఉమెన్ రైట్స్ ప్రొటెక్షన్ కమిషన్ అధినేత ముజాహిద్ ఆధ్వర్యంలో, ఐహెచ్ఆర్‌పీసీ సహకారంతో,కిమ్స్ సవేరా హాస్పిటల్ వైద్య బృందం ఆధ్వర్యంలో ఈ ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు.

ఈ సందర్భంగా శిబిరానికి హాజరైన ప్రజలకు 16 రకాల వైద్య పరీక్షలు, చికిత్సలను ఉచితంగా అందించారు.వివిధ ఆరోగ్య సమస్యలకు సంబంధించి వైద్యులు పరీక్షలు నిర్వహించి అవసరమైన వైద్య సలహాలు,సూచనలు అందించారు.వైద్య పరీక్షల కోసం వచ్చిన ప్రజలకు ఎలాంటి రుసుము లేకుండా సేవలు అందించడం పట్ల నిర్వాహకులు ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారు.

**నిరుపేదలకు ఎంతో ప్రయోజనం**

ఈ సందర్భంగా న్యాయవాది సుమలత మీడియాతో మాట్లాడుతూ, సాధారణంగా ప్రైవేట్ కార్పొరేట్ ఆసుపత్రుల్లో వివిధ రకాల వైద్య పరీక్షలు, చికిత్సలు చేయించుకోవాలంటే అధిక మొత్తంలో ఖర్చు అవుతుందని తెలిపారు.ఆర్థిక స్థోమత లేని పేద, మధ్యతరగతి కుటుంబాలకు ఇది భారంగా మారుతుందని పేర్కొన్నారు.

అందుకే నిరుపేద కుటుంబాలకు అండగా నిలవాలనే ఉద్దేశంతో ఈ మెగా మెడికల్ క్యాంపును నిర్వహించినట్లు తెలిపారు.16 రకాల వైద్య పరీక్షలు, చికిత్సలను ఎలాంటి ఖర్చు లేకుండా ఉచితంగా అందిస్తున్నామని చెప్పారు.ప్రజలకు అందుబాటులో ఉన్న ఇలాంటి వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.ఆరోగ్యంపై నిర్లక్ష్యం చేయకుండా ముందస్తుగా వైద్య పరీక్షలు చేయించుకోవడం ద్వారా అనారోగ్య సమస్యలను గుర్తించి తగిన చికిత్స పొందవచ్చని తెలిపారు.నిరుపేద కుటుంబాలకు ఉచిత వైద్య సేవలు అందించేందుకు సహకరించిన నిర్వాహకులు,కిమ్స్ సవేరా హాస్పిటల్ వైద్య బృందానికి పలువురు అభినందనలు తెలిపారు.

ఈ కార్యక్రమంలో పాఠశాల హెడ్మాస్టర్ జ్యోతిలక్ష్మి,ఎంఈఓ లు రాజేశ్వరి దేవి, గోపాల్ నాయక్, నేషనల్ ప్రెసిడెంట్ అండ్ ఫౌండర్ డాక్టర్ ముజాహిద్,ఆర్టిఐ సెల్ ప్రెసిడెంట్ తాహిర్,నేషనల్ లీగల్ సెల్ వైస్ ప్రెసిడెంట్ జూకూరు సుమలత, నిర్వాహకులు, వైద్యులు,సిబ్బంది, మహిళలు,స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# ధర్మవరం చెరువును అద్భుతమైన లేక్‌ఫ్రంట్‌గా అభివృద్ధి చేస్తాం:మంత్రి సత్యకుమార్ యాదవ్

- ధర్మవరం చెరువు నిర్మాణంలో ఒడియార్ కీలక పాత్ర..చారిత్రక నేపథ్యాన్ని భావితరాలకు అందించాలి: మంత్రి
- చెరువులోకి మురుగునీరు చేరకుండా చర్యలు.. ఆక్రమణలకు అడ్డుకట్ట వేస్తామని వెల్లడి
- చెరువు చుట్టూ వాక్‌వే,జాగింగ్,సైకిల్ ట్రాక్‌లు..పచ్చదనం, లైటింగ్,వ్యూయింగ్ పాయింట్ల ఏర్పాటు
- ఏడు ప్రాంతాల్లో ప్రత్యేక థీమ్‌లు.. బోటింగ్,ప్యాడ్లింగ్, పార్కులు,ఫుడ్ స్టాల్స్‌తో అభివృద్ధి



**ధర్మవరం సెప్టెంబర్ 26 (పెన్ సత్తా)** శ్రీ సత్య సాయి జిల్లా ధర్మవరం చెరువును అద్భుతమైన లేక్‌ఫ్రంట్‌గా అభివృద్ధి చేస్తామని రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు. పట్టణంలోని ఎన్డీఏ కార్యాలయంలో శనివారం స్కూల్ ఆఫ్ ప్లానింగ్ అండ్ ఆర్కిటెక్చర్ (ఎస్‌పీఏ), విజయవాడ బృందంతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి సత్య కుమార్ మాట్లాడుతూ, ధర్మవరం చెరువు నిర్మాణంలో ఒడియార్ కీలక పాత్ర పోషించిన చారిత్రక నేపథ్యాన్ని భావితరాలకు తెలియజేయాల్సిన అవసరం ఉందన్నారు. ధర్మవరం నిర్మాణానికి కృషి చేసిన మహనీయుల సేవలను గుర్తుచేసేలా లేక్‌ఫ్రంట్ అభివృద్ధిలో చారిత్రక,సాంస్కృతిక వారసత్వానికి ప్రత్యేక స్థానం కల్పించాలని భావిస్తున్నట్లు తెలిపారు.ధర్మవరం చరిత్రకు సంబంధించిన ప్రముఖులు, సాహితీవేత్తలు, క్రీడాకారులు,చేనేత రంగానికి సేవలందించిన ప్రముఖుల వివరాలను ప్రజలకు పరిచయం చేసేలా ప్రత్యేక థీమ్ ప్రాంతాలను ఏర్పాటు చేయాలని ఆలోచిస్తున్నట్లు చెప్పారు. మురుగునీటికి అడ్డుకట్ట దశాబ్దాలుగా మురుగునీటితో కలుషితమవుతూ, ఆక్రమణలు,నిర్లక్ష్యం కారణంగా చెరువు తన సహజ స్వరూపాన్ని కోల్పోతున్న పరిస్థితిని మార్చాల్సిన అవసరం ఉందన్నారు. చెరువును ఆక్రమణల నుంచి పరిరక్షించడంతో పాటు మురుగునీరు చెరువులోకి చేరకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు.నీటిని శుద్ధి చేసి పరిశుభ్రమైన నీటి సరస్సుగా తీర్చిదిద్దడం ప్రణాళికలో ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు.

**ఏడు ప్రాంతాల్లో ప్రత్యేక థీమ్‌లు**

పట్టణ ప్రజలకు వాకింగ్,జాగింగ్, సైక్లింగ్,విహారం, క్రీడలకు అనువైన వాతావరణం కల్పించేలా చెరువు చుట్టూ వాక్‌వేలు, జాగింగ్ ట్రాక్‌లు, సైకిల్ ట్రాక్‌లు, పచ్చదనం, కూర్చునే ప్రదేశాలు, లైటింగ్,వ్యూయింగ్ పాయింట్లు ఏర్పాటు చేయనున్నట్లు మంత్రి తెలిపారు.చెరువు పరిధిలో ఏడు ప్రాంతాలను ప్రత్యేకంగా అభివృద్ధి చేయాలని భావిస్తున్నట్లు చెప్పారు.ఒక్కో ప్రాంతానికి ప్రత్యేక థీమ్‌తో యాంఫిథియేటర్, ఫుడ్ స్టాల్స్,యువత, కుటుంబాలు,పిల్లలు, వృద్ధులు సేదతీరే ప్రదేశాలను ఏర్పాటు చేసే అవకాశం ఉందన్నారు.బోటింగ్, ప్యాడ్లింగ్ వంటి సౌకర్యాలతో పాటు పిల్లల కోసం పార్క్, బోటింగ్ డెక్స్, పార్కింగ్, టాయిలెట్లను కూడా ఏర్పాటు చేసేలా ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు మంత్రి వివరించారు.

ఈ సమావేశంలో ధర్మవరం ఆర్డీవో రాంభూపాల్‌రెడ్డి, ఎస్‌పీఏ విజయవాడ సిబ్బంది,ఈఈ సాయికృష్ణ,ఇరిగేషన్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## అనకాపల్లి జిల్లా కూటమి సమన్వయకర్తల సమావేశం.

- యలమంచిలి నుండి హాజరైన కూటమి నేతలు.



**అచ్యుతాపురం, పెన్ సత్తా, సెప్టెంబర్ 26:** అనకాపల్లి జిల్లా కూటమి సమన్వయకర్తల సమావేశం ఘనంగా జరిగింది. ఈ సమావేశానికి జిల్లా లోని నియోజకవర్గ ఇన్చార్జులు, ఎమ్మెల్యేలు హాజరయ్యారు. ఈ సమావేశానికి యలమంచిలి నియోజకవర్గం జనసేన పార్టీ నుండి సుందరపు విజయ్ కుమార్, తెలుగుదేశం పార్టీ నుండి ప్రగడ నాగేశ్వర రావు, బీజేపీ పార్టీ నుండి సమన్వయకర్తగా కోరుపోలు చిన్నారావు హాజరయ్యారు. ఈ సందర్భంగా కూటమి బలోపేతం, జిల్లాలో పార్టీ కార్యక్రమాల నిర్వహణ, ప్రజా సమస్యల పై చర్చించారు. రానున్న ఎన్నికలకు కూటమి ఆధ్వర్యంలో చేపట్టాల్సిన కార్యక్రమాల పై సమన్వయకర్తలు దిశానిర్దేశం చేశారు. ప్రజల్లోకి మరింతగా వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించాలని నిర్ణయించారు.

## ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కు అందజేసిన పంచకర్ల



**పరవాడ, పెన్ సత్తా, సెప్టెంబర్ 26:**అనకాపల్లి జిల్లా పెందుర్తి నియోజకవర్గం పరవాడ మండలం భరణికం శివారు గ్రామం కట్టావానిపాలెం గ్రామానికి చెందిన కండిపిల్లి చంద్రశేఖర్, భవాని దంపతుల కుమారుడు కండిపిల్లి లెహంత్ ఇటీవలే అనారోగ్యానికి గురికావడంతో విశాఖపట్నం లో గల ప్రముఖ హాస్పిటల్లో చికిత్స చేయించారు. చికిత్స నిమిత్తం సుమారు 40 వేల రూపాయలు ఖర్చు చేసినట్లు లెహంత్ తల్లిదండ్రులు గ్రామ జనసేన సీనియర్ నాయకుడు పెదిశెట్టి సత్యారావు, పెదిశెట్టి రామరావు, మాజీ సర్పంచ్ బొండా తాతారావు దృష్టికి తీసుకుని రావడం జరిగింది. దీంతో స్పందించిన గ్రామ పెద్దలు పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు దృష్టికి తీసుకుని వెళ్లగా ముఖ్యమంత్రి సహాయనిధికి ఎమ్మెల్యే సిఫార్సు చేయడం జరిగింది. దీంతో ఈ రోజు ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి చంద్రశేఖర్ కుటుంబానికి 25,000 వేల రూపాయలు ఎమ్మెల్యే చేతుల మీదుగా పెందుర్తి జనసేన కార్యాలయంలో చెక్కు రూపంలో అందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలతో పాటు కట్టావానిపాలెం గ్రామ టీడీపీ సీనియర్ నేత వడిశిల పైడిరాజు, జనసేన సీనియర్ కార్యకర్త నాగల పైడిరాజు పాల్గొన్నారు.ద

## కార్మికుల హక్కుల సాధనకు ఛలో ఢిల్లీ

- సిఐటియు జిల్లా అధ్యక్షులు వి వి శ్రీనివాసరావు



**నక్కపల్లి,పెన్ సత్తా, సెప్టెంబర్ 26:**కార్మికుల హక్కుల సాధనకై డిసెంబర్ ఒకటిన జరిగే ఛలో ఢిల్లీ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షులు వి వి శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయాలని, లేబర్ కోడ్స్ రద్దు, స్కీం వర్కర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్లపై డిసెంబరు ఒకటిన ఢిల్లీలో జరిగే కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.శనివారం ఈరోజు నక్కపల్లి నూకాలమ్మ గుడిలో ఆవరణలో జరిగిన మండల సిఐటియు సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా హాజరై పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏళ్ల తరబడి పనిచేస్తున్న స్కీం వర్కర్లకు వేతనాలు పెంచకుండా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు తాత్సారం చేస్తున్నాయని, నిత్యవసర వస్తువులు ధరలు విపరీతంగా పెరిగి తీవ్ర పని ఒత్తిడితో పని చేస్తున్న కనీసం సంక్షేమ పథకాలు కూడా అమలు చేయకుండా ప్రభుత్వం వెట్టి చాకిరీ చేయించుకుంటుందని అన్నారు. లేబర్ కోడ్స్ తీసుకొచ్చి 8 గంటల పని విధానాన్ని 12 గంటలకు పెంచటం, ఫిక్సిటర్మ్ ఎంప్లాయిమెంట్ పేరుతో యజమానులకు అనుకూలంగా చట్టాలు చేశారని అన్నారు. ఈ డిమాండ్ల సాధనకై దేశవ్యాప్తంగా జరుగుతున్న ఆందోళనలో భాగంగా డిసెంబర్ ఒకటిన చలో ఢిల్లీ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆయన తెలియజేశారు. నక్కపల్లి మండలంలో ఉండే కార్మికుల సమస్యలు పరిష్కారానికి ఈ ప్రాంతం నుంచి కూడా చలో ఢిల్లీ కార్యక్రమంలో కార్మికుల పెద్ద ఎత్తున పాల్గొవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి మనబాల రాజేష్, అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు ఎం దుర్గారాణి, సుబ్బలక్ష్మి, కవిత, రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధ్యాయులకు తెలుగు, క్రీడా బోధనపై శిక్షణ



**భీమిలి మండలం, ,సెప్టెంబర్ 26 (పెన్ సత్తా)**పాఠశాల సముదాయ కార్యక్రమంలో భాగంగా భీమిలి మండలం పెద మంగమారిపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తెలుగు, వ్యాయామ ఉపాధ్యాయులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. తెలుగు ఉపాధ్యాయులకు క్లస్టర్ రిసోర్స్ పర్సన్లు రామోజు రాజేష్, రెడ్డి గంగరాజు శిక్షణ ఇచ్చారు. వ్యాయామ ఉపాధ్యాయులకు కె. శ్రీనివాసరావు, మహమ్మద్ షబ్బీర్ శిక్షణ అందించారు.తెలుగు రిసోర్స్ పర్సన్ రామోజు రాజేష్ నిర్మాణాత్మక మదింపు, విద్యార్థులు అసెస్మెంట్ పుస్తకాలు రాసే విధానం, టూల్స్ 1, 2, 3 పూరించే విధానం, ప్రశస్త టూల్ ద్వారా ప్రత్యేక అవసరాలు కలిగిన విద్యార్థులకు బోధించే పద్ధతులను వివరించారు. పదో తరగతి విద్యార్థులకు సంబంధించిన నమూనా ప్రశ్నాపత్రంపై అవగాహన కల్పించారు. రెడ్డి గంగరాజు కృత్రిమ మేధస్సును ఉపయోగించి విద్యార్థులకు బోధించే విధానం, భవిష్యత్ విద్యా విధానంలో కృత్రిమ మేధస్సు ప్రాధాన్యత, ఉపాధ్యాయుల శిక్షణ, నాయకత్వ లక్షణాలపై వివరించారు.ముఖ్య అతిథిగా పాల్గొన్న మండల విద్యాశాఖ అధికారి ఎం. శివరాణి మాట్లాడుతూ శిక్షణలో నేర్చుకున్న అంశాలను పాఠశాల స్థాయిలో సమర్థవంతంగా అమలు చేయాలని సూచించారు. ప్రభుత్వ విద్యా కార్యక్రమాల అమలులో ప్రతి ఉపాధ్యాయుడు భాగస్వామి కావాలని తెలిపారు. పాఠశాల సముదాయ ప్రధానోపాధ్యాయురాలు వి.వి.కె. పద్మావతి మాట్లాడుతూ విద్యార్థుల విద్యాభివృద్ధిలో ఉపాధ్యాయులు వెన్నుముకగా నిలవాలని అన్నారు.వ్యాయామ రిసోర్స్ పర్సన్లు క్రీడా శిక్షణ నైపుణ్యాలు, విద్యార్థులకు క్రీడల ద్వారా కలిగే ప్రయోజనాలను వివరించారు. వాలీబాల్ ఆడేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సూచనలను తెలియజేసి ఉపాధ్యాయులతో వాలీబాల్ ఆటను ఆడించారు. విద్యార్థుల్లో శారీరక, మానసిక సామర్థ్యాల పెంపునకు అవసరమైన వేగం, బలం, ఓర్పు, సహకారం, సమతుల్యత, నియంత్రణ, చురుకుదనం తదితర అంశాలపై అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో సీనియర్ వ్యాయామ ఉపాధ్యాయులు చిల్లా వెంకటరెడ్డి, సీఆర్పీ ఎం. కొండ తదితరులు పాల్గొన్నారు.

## భీమిలిలో హింసకు పాల్పడితే కఠిన చర్యలు: సీఐ దివాకర్ యాదవ్



**భీమిలి, ,సెప్టెంబర్ 26 (పెన్ సత్తా)**రానున్న పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో భీమిలి మండలంలో ఎవరైనా గొడవలు, దాడులు, కత్తులు, బ్లేడ్లు, బాంబులు వంటి హింసాత్మక చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని భీమిలి సీఐ దివాకర్ యాదవ్ హెచ్చరించారు. ఐదుగురు కలిసి దాడికి పాల్పడిన ఘటనల్లో వారిలో ఒక్కరు నేరానికి పాల్పడినా, మిగిలిన వారిపై కూడా చట్టపరమైన చర్యలు ఉంటాయని తెలిపారు.చిన్నదే కదా అని ఇతరులపై దాడులు చేయడం, బెదిరించడం వంటి చర్యలను పోలీసులు కూడా చిన్న విషయంగా పరిగణించరని స్పష్టం చేశారు. అవసరమైతే రౌడీ షీట్లు తెరవడంతో పాటు కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ముఖ్యంగా విద్యార్థులు, యువత భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని ఎలాంటి నేరాలకు పాల్పడవద్దని సూచించారు.

ఎవరికి ఏదైనా సమస్య లేదా ఇబ్బంది ఉంటే నేరుగా భీమిలి పోలీస్ స్టేషన్కు వచ్చి ఫిర్యాదు చేయాలని, పోలీసుల దృష్టికి తీసుకువస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని సీఐ తెలిపారు. ఇతరులను ఇబ్బందులకు గురిచేయకుండా ప్రతి ఒక్కరూ శాంతియుతంగా ఉండాలని కోరారు.

## బొత్స అనూషను కలిసిన పద్మనాభం వైసీపీ నేతలు



**పద్మనాభం, ,సెప్టెంబర్ 26 (పెన్ సత్తా)** భీమిలి నియోజకవర్గానికి నూతనంగా నియమితులైన వైఎస్సార్సీపీ సమన్వయకర్త బొత్స అనూషను పద్మనాభం మండలానికి చెందిన వైఎస్సార్సీపీ నాయకులు, కార్యకర్తలు శనివారం ఆమె స్వగృహంలో మర్యాదపూర్వకంగా కలిశారు. మండల వైఎస్సార్సీపీ అధ్యక్షుడు కోరాడ లక్ష్మణరావు, ఎంపీపీ కే. రాంబాబు, జడ్పీ వైస్ చైర్మన్ ఎస్. గిరిబాబు ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు ఆమెకు పూలగుచ్ఛం అందించి శాలువాతో సత్కరించారు.ఈ సందర్భంగా బొత్స అనూష నాయకులు, కార్యకర్తలతో ఆప్యాయంగా మాట్లాడి మండలంలోని పార్టీ పరిస్థితులను, స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. పార్టీకి కార్యకర్తలే బలమని, వారికి అన్ని వేళలా అండగా ఉంటానని తెలిపారు. మండలంలో పార్టీని మరింత బలోపేతం చేసేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, వైఎస్సార్సీపీ అధినేత వైఎస్ జగన్మోహన్రెడ్డి సూచనలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని అన్నారు.

## మద్ది గ్రామంలో ఘనంగా అన్నదానం.. 2,000 మందికి అన్నప్రసాదం



**పద్మనాభం, ,సెప్టెంబర్ 26 (పెన్ సత్తా)**పద్మనాభం మండలం మద్ది గ్రామంలో కాళ్ళ నగేష్ కుమార్ ఆధ్వర్యంలో మహా అన్నదాన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సుమారు 2,000 మంది గ్రామస్థులు, భక్తులు, ప్రజలకు అన్నప్రసాదాన్ని అందజేశారు. పెద్ద సంఖ్యలో ప్రజలు తరలివచ్చి అన్నప్రసాదాన్ని స్వీకరించడంతో గ్రామంలో సందడి నెలకొంది. కార్యక్రమానికి హాజరైన ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా నిర్వాహకులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా కాళ్ళ నగేష్ కుమార్ మాట్లాడుతూ ఆకలితో ఉన్నవారికి అన్నం పెట్టడం గొప్ప సేవా కార్యక్రమమని అన్నారు. అన్నదానం ద్వారా మానవత్వం, సేవాభావాన్ని చాటుకోవచ్చని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ తమకు సాధ్యమైన మేరకు సేవా కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. భవిష్యత్తులోనూ ఇలాంటి సేవా కార్యక్రమాలను కొనసాగించాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, మహిళలు, కమిటీ సభ్యులు, భక్తులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## కళింగ వైశ్యులపై విమర్శలు సరికాదు: సంతోష్ కుమార్

**విశాఖపట్నం, ,సెప్టెంబర్ 26 (పెన్ సత్తా)** కళింగ వైశ్య సామాజిక వర్గానికి సేవ చేయని వైసీపీ నాయకులు ఇప్పుడు విమర్శలు చేయడం విడ్డూరంగా ఉందని కళింగ వైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ సంతోష్ కుమార్ తంగుడు అన్నారు. గత ప్రభుత్వ హయాంలో తిరుపతిలో కళింగ వైశ్యులకు సైట్లు కేటాయించామని చెప్పి జీవోల పేరుతో ప్రజలను తప్పుదోవ పట్టించారని ఆరోపించారు. నిజంగా సైట్లు కేటాయించి ఉంటే వాటి వివరాలు, జీవోలను ప్రజలకు వెల్లడించాలని డిమాండ్ చేశారు.

కళింగ వైశ్యుల సమస్యలపై టీడీపీ ప్రతిపక్షంలో ఉన్నప్పటి నుంచే పోరాడిందని తెలిపారు. ఓబీసీ జాబితాలో కళింగ వైశ్యులను చేర్చాలనే డిమాండ్ను పబ్లిక్ హియరింగ్ వరకు తీసుకెళ్లిన ఘనత టీడీపీకే దక్కుతుందని పేర్కొన్నారు. కళింగ వైశ్యులు వాస్తవాలను పరిశీలించి స్థానిక సంస్థల ఎన్నికల్లో ఐక్యతను చాటాలని సంతోష్ కుమార్ పిలుపునిచ్చారు


## భీమిలి--ఆనందపురం రహదారిలో స్పెషల్ డ్రైవ్.. 100 మంది వాహనదారులకు జరిమానా



**ఆనందపురం, ,సెప్టెంబర్ 26 (పెన్ సత్తా)**విశాఖపట్నం పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి ఆదేశాల మేరకు, ట్రాఫిక్ అదనపు డీసీపీ, ఏసీపీ ట్రాఫిక్ సూచనలతో భీమిలి క్రాస్ రోడ్డు నుంచి ఆనందపురం వైపు వచ్చే రహదారిలో శనివారం ప్రత్యేక వాహన తనిఖీలు నిర్వహించారు. నార్త్ ట్రాఫిక్ సీఐ సీహెచ్. ఉమాకాంత్, ఆనందపురం ట్రాఫిక్ ఎస్సై పి. పాపారావు సిబ్బందితో కలిసి ఈ తనిఖీలు చేపట్టారు.పోలీసులు అత్యాధునిక స్పీడ్ లేజర్ గన్ను వినియోగించి అతివేగంగా ప్రయాణించే వాహనాలను గుర్తించారు. అలాగే హెల్మెట్ లేకుండా ప్రయాణించడం, వాహనం నడుపుతూ సెల్ఫోన్ మాట్లాడటం, ట్రిపుల్ రైడింగ్ వంటి ఉల్లంఘనలకు పాల్పడిన వాహనదారులను గుర్తించారు. ప్రత్యేక డ్రైవ్లో మొత్తం 100 మంది వాహనదారులపై మోటారు వాహనాల చట్టం ప్రకారం జరిమానాలు విధించినట్లు ట్రాఫిక్ పోలీసులు తెలిపారు. రహదారి భద్రత, ప్రమాదాల నివారణలో భాగంగా ఇలాంటి తనిఖీలు కొనసాగుతాయని పేర్కొన్నారు.

## హుకుంపేటలో ముత్యాల గణపతి ఉత్సవాలు.. అన్నసమారాధనలో పాల్గొన్న సిరమ్మ

**విజయనగరం, ,సెప్టెంబర్ 26 (పెన్ సత్తా)**విజయనగరం నగరంలోని హుకుంపేటలో ముత్యాల గణపతి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. ముత్యాల గణపతి యూత్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన అన్నసమారాధన కార్యక్రమానికి భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.ముత్యాల గణపతి కమిటీ సభ్యుల ఆహ్వానం మేరకు తెలుగుదేశం పార్టీ యువ నాయకురాలు, చిన్న శ్రీను సోల్జర్స్ అధ్యక్షురాలు సిరమ్మ కార్యక్రమానికి హాజరై గణనాథుడిని దర్శించుకున్నారు. అనంతరం అన్నసమారాధన కార్యక్రమంలో పాల్గొని భక్తులకు ప్రసాదాన్ని వితరణ చేశారు.కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, ముత్యాల గణపతి కమిటీ సభ్యులు, చిన్న శ్రీను సోల్జర్స్ ఉపాధ్యక్షుడు తోట వాసు, సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.



## అవంతి ఫార్మసీ కళాశాలలో ఘనంగా ప్రపంచ ఫార్మాసిస్ట్ దినోత్సవం




**తగరపువలస, ,సెప్టెంబర్ 26 (పెన్ సత్తా)**తగరపువలసలోని అవంతి ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ సైన్సెస్ కళాశాలలో ప్రపంచ ఫార్మాసిస్ట్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. "స్వస్త్ భారత్--కంబాటింగ్ యాంటీమైక్రోబియల్ రెసిస్టన్స్" నినాదంతో జరిగిన కార్యక్రమాన్ని అవంతి కళాశాలల చైర్మన్, మాజీ మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాసరావు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఫార్మసిస్టుల ప్రాధాన్యత, ఫార్మసీ రంగంలోని ఉద్యోగావకాశాలు, ప్రజారోగ్య పరిరక్షణలో వారి పాత్రను వక్తలు వివరించారు. ఆంధ్రా యూనివర్సిటీ ప్రిన్సిపాల్ డా. జి. గిరిజా శంకర్ విద్యార్థులు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుని పరిశోధన, సేవా రంగాల్లో ముందుకు సాగాలని సూచించారు. బొటానిక్స్ ఇండస్ట్రీస్ సీఈఓ డా. ఎస్.వి.ఎన్. సురేష్ బాబు పుస్తక జ్ఞానంతో పాటు ప్రాయోగిక పరిజ్ఞానం అవసరమన్నారు.ప్రపంచ ఫార్మాసిస్ట్ దినోత్సవం సందర్భంగా నిర్వహించిన వివిధ పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ డా. ఎ. చంద్రశేఖర్, ప్రిన్సిపాల్ డా. పూర్ణ నాగశ్రీ, డా. ఉమాశంకర్, అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## పెద్దిపాలెం ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్లో శ్రమదానం

**పెద్దిపాలెం, ,సెప్టెంబర్ 26 (పెన్ సత్తా):**పెద్దిపాలెంలోని ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ ఆవరణలో శ్రమదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గడ్డి, చెత్తాచెదారం, తుప్పలను తొలగించారు. బీజేపీ రాష్ట్ర కౌన్సిలర్ ఉప్పాడ అప్పారావు, బోని బంగర్రాజు స్వయంగా శ్రమదానంలో పాల్గొన్నారు. ప్రజల ఆరోగ్యానికి పరిశుభ్రత ఎంతో ముఖ్యమని ఉప్పాడ అప్పారావు పేర్కొన్నారు. కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.




## విశాఖ జిల్లాలో 28న నులిపురుగుల నిర్మూలన కార్యక్రమం



**విశాఖపట్నం, ,సెప్టెంబర్ 26 (పెన్ సత్తా)ప్రతినిధి:**విశాఖపట్నం జిల్లాలో సెప్టెంబర్ 28న 18వ జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవాన్ని నిర్వహించనున్నట్లు జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డా. పి. జగదీశ్వర రావు తెలిపారు. జిల్లాలో 1 నుంచి 19 ఏళ్ల వయస్సు గల సుమారు 5,74,496 మంది పిల్లలు, కిశోరులకు ఆల్బెండజోల్ మాత్రలు అందించనున్నారు. అంగన్వాడీ కేంద్రాలు, ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, జూనియర్ కళాశాలలు, ఇతర విద్యాసంస్థల్లో మాత్రలను ఆరోగ్య సిబ్బంది, ఉపాధ్యాయుల పర్యవేక్షణలో భోజనం అనంతరం అందించాలని సూచించారు. సెప్టెంబర్ 28న మాత్రలు తీసుకోలేని వారికి అక్టోబర్ 5న మాప్అప్ డే నిర్వహించనున్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలకు మాత్రలు తప్పనిసరిగా ఇప్పించి కార్యక్రమానికి సహకరించాలని అధికారులు విజ్ఞప్తి చేశారు.

## గణేష్ అన్నదానానికి నవీన్ జ్ఞానేశ్వర్ రూ.10 వేల విరాళం





**ఆనందపురం, ,సెప్టెంబర్ 26 (పెన్ సత్తా)**ఆనందపురం 24 కాలనీలో గణేష్ యూత్ ఆధ్వర్యంలో శనివారం సుమారు 2 వేల మంది భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కేఎన్బీ మెమోరియల్ ట్రస్ట్ చైర్మన్, టీడీపీ యువ నాయకుడు కోరాడ నవీన్ జ్ఞానేశ్వర్ గణేష్ విగ్రహాన్ని దర్శించుకుని రూ.10 వేల విరాళాన్ని అందజేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించి భక్తులకు స్వయంగా అన్నప్రసాదాన్ని వడ్డించారు. యువత ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలను ప్రోత్సహించాలని నవీన్ జ్ఞానేశ్వర్ అన్నారు. యువత చేపట్టే సేవా కార్యక్రమాలకు తనవంతు సహాయ సహకారాలు ఎల్లప్పుడూ అందిస్తానని తెలిపారు.

కార్యక్రమంలో భీమిలి వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ కుప్ప రామలక్ష్మి, ఉత్సవ కమిటీ ప్రతినిధి ముడసల శ్రీను, ఇతర కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## పర్యావరణ హిత జీవన విధానం అలవర్చుకోవాలి



**గాజువాక, ,సెప్టెంబర్ 26 (పెన్ సత్తా)**ప్రతి ఒక్కరూ పర్యావరణ హిత జీవన విధానాన్ని అలవర్చుకోవాలని గ్రీన్ క్లైమేట్ టీం ఎన్జీవో వ్యవస్థాపక కార్యదర్శి జె.వి. రత్నం పిలుపునిచ్చారు. శనివారం గాజువాకలోని సిద్ధార్థ పబ్లిక్ స్కూల్లో ప్రకృతి రైతు జమీల్ ఆధ్వర్యంలో మొక్కల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా రత్నం మాట్లాడుతూ ప్రతి ఇంట్లో గాలిని శుద్ధి చేసే మొక్కలు పెంచాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. మనం తినే పండ్ల విత్తనాలతో సామాజిక వనాలను అభివృద్ధి చేయాలని కోరారు. శీతోష్ణస్థితి మార్పుల నేపథ్యంలో పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని అన్నారు.సంస్థ ప్రతినిధి కుసుమ మాట్లాడుతూ విద్యార్థులకు పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. ఉపాధ్యాయురాలు రెహానా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడంతో పాటు సమస్త జీవులను కాపాడుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రెహామున్నీసా, విద్యార్థులు పాల్గొన్నారు.

# ఫారం-6లో చట్ట, రాజ్యాంగ విరుద్ధమైన మార్పులు

కేంద్ర ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్‌పై కాంగ్రెస్ తీవ్ర విమర్శలు గుప్పించింది. ఓటరు నమోదు ప్రక్రియలో భారత ఎన్నికల సంఘం (ఈసీఐ) చేసిన మార్పుల వల్ల తొలిసారి ఓటు వేస్తున్న జెన్‌జీ ఓటర్లకు ఆటంకాలు ఏర్పడ్డాయని ఆరోపించింది. సీఈసీ జ్ఞానేష్ కుమార్ ఉద్దేశపూర్వకంగా చట్టాన్ని, రాజ్యాంగ పద్ధతులను ఉల్లంఘించి ఫారం 6ను ఏకపక్షంగా మార్చారని విమర్శించింది. ఈ విషయాన్ని సుప్రీంకోర్టు సుమోటోగా స్వీకరించి, ఆయనను జవాబుదారీగా చేయాలని కోరింది. యువ ఓటర్ల కోసం ప్రత్యేక నమోదు శిబిరాలను నిర్వహించాలన్న ఈసీ నిర్ణయంపై కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ స్పందించి, ఈ మేరకు 'ఎక్స్'లో పోస్ట్ పెట్టారు.

శుక్రవారం రాత్రి ఆలస్యంగా ఆందోళనకు గురైన ఎన్నికల సంఘం యువ ఓటర్ల కోసం ప్రత్యేక నమోదు శిబిరాలను నిర్వహించాలని నిర్ణయించింది. సోషల్ మీడియా ద్వారా ఓటర్ ప్రత్యేక నమోదు శిబిరాలకు విస్తృత ప్రచారం కల్పించాలని అధికారులను ఆదేశించింది. కానీ స్వయంగా సీఈసీయే ఫారం- 6లో స్పష్టంగా చట్టవిరుద్ధమైన, రాజ్యాంగ విరుద్ధమైన మార్పులు చేసి, యువ ఓటర్లను చేర్చడాన్ని దాదాపు అసాధ్యం చేశారు. దరఖాస్తుదారుడి తల్లిదండ్రులు లేదా తాతలు గత స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్)లో భాగంగా ఉన్నారా? లేదా? అనే వివరాలను కోరుతూ ఫారం-6లో ఒక కొత్త తప్పనిసరి విభాగాన్ని చేర్చారు. ఇది తొలిసారి ఓటు వేస్తున్న జెన్‌జీ ఓటర్లకు అడ్డంకిగా మారింది. ఈ మార్పు పూర్తిగా చట్టవిరుద్ధం- జైరాం రమేశ్, కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి

**ఫారం-6ను దొంగచాటుగా మార్చారు**



2026 జులై ప్రారంభంలో ఎలాంటి అధికారిక ప్రకటన లేకుండా ఫారం-6ను దొంగచాటుగా మార్చారని జైరాం రమేశ్ ఆరోపించారు. ఇది ఈసీ మొదటి ఉల్లంఘన అని పేర్కొన్నారు. 'ఉల్లంఘన 2: ఫారం- 6ను సవరించే అధికారం ఈసీఐకి లేదు. ప్రజా ప్రాతినిధ్య చట్టం- 1950 ప్రకారం ఈ అధికారం కేవలం కేంద్ర ప్రభుత్వానికి మాత్రమే ఉంది. ఇది ఎన్నికల సంఘం స్పష్టమైన అతిక్రమణ. ఉల్లంఘన 3: ఓటర్ల నమోదు నిబంధనలు- 1960 ప్రకారం ఎలాంటి సవరణ చేయకుండా ఫారం-6ను మార్చారు. పార్లమెంటుకు సరైన సమాచారం ఇచ్చి కేంద్ర ప్రభుత్వం మాత్రమే అలా చేయగలదు. ఒక శాసనబద్ధమైన ఫారంను, కలవరపడిన ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షా ద్వయం ఆదేశాల మేరకు సీఈసీ జ్ఞానేశ్ కుమార్ ఏకపక్షంగా మార్చారు. సుప్రీంకోర్టు తక్షణమే సుమోటోగా కేసును స్వీకరించి, ఈ విషయానికి సీఈసీని జవాబుదారీగా చేయాలి. లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ చెప్పినట్లుగా జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేసి అప్రూవర్‌గా మారడం ద్వారా తన తప్పును సరిదిద్దుకోవచ్చు. ముఖ్యంగా భారత యువత అటువంటి చర్యను ఆమోదిస్తుంది' అని జైరాం రమేశ్ పేర్కొన్నారు.

**'జ్ఞానేశ్ కుమార్ చట్టాన్ని ఉల్లంఘించారు'**

ా×=కు సంబంధించిన నిర్ణయాలు, ఆదేశాలపై ఎన్నికల కమిషనర్లు సుఖ్‌బీర్ సింగ్ సంధు, వివేక్ జోషి 10 నెలల వ్యవధిలో కనీసం 14సార్లు అభ్యంతరం వ్యక్తం చేశారని ఇటీవలే ఓ ప్రముఖ పత్రిక తన నివేదికలో పేర్కొనడంపైనా జైరాం రమేశ్ స్పందించారు. యువ, తొలిసారి ఓటు వేసేవారు ఎలాంటి వేధింపులు లేకుండా తమ ఓటు హక్కును నమోదు చేసుకోగలిగేలా ఫారం-6కు సంబంధించిన చట్టవిరుద్ధమైన, అనధికారిక మార్పులను వెనక్కి తీసుకోవాలని ఇద్దరు ఎన్నికల కమిషనర్లు కోరారని పేర్కొన్నారు. సీఈసీ జ్ఞానేశ్ కుమార్ రాజ్యాంగ సంప్రదాయాలు, పద్ధతులను ఉల్లంఘించడమే కాకుండా పార్లమెంట్ ఆమోదించిన చట్టాన్ని కూడా ఉల్లంఘించారని మండిపడ్డారు. ఆయన పదవిలో కొనసాగడం భారత ప్రజలను అవమానించడమేనని అభిప్రాయపడ్డారు.

**జ్ఞానేశ్‌పై విపక్షాలు ఫైర్- బీజేపీ మద్దతు**

సీఈసీ జ్ఞానేశ్ కుమార్ రాజీనామాకు ప్రతిపక్షాలు పట్టుపడుతుండగా, ఆయనకు బీజేపీ మద్దతుగా నిలిచింది. ఎన్నికల ఓటముల నుంచి ప్రజల దృష్టిని మళ్లించే ప్రయత్నాలని ప్రతిపక్షాల ఆరోపణలను కొట్టిపారేసింది. ఎన్నికల సంఘం పక్షపాతంగా వ్యవహరించి ఉంటే కేరళ వంటి రాష్ట్రాల్లో ప్రతిపక్షాలు గెలిచి ఉండేవి కావని పేర్కొంది. మరోవైపు, కేంద్ర మంత్రి, ఎన్‌డీఏ మిత్రపక్ష పార్టీ ఎల్‌జేపీ (రామ్‌విలాస్) నాయకుడైన చిరాగ్ పాసవాన్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఎన్నికల ప్రక్రియపై ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టేందుకు, ఈ ఆరోపణలపై ఎన్నికల సంఘం తన వైఖరిని స్పష్టంగా తెలియజేయాలని అన్నారు. ముఖ్యంగా సీఈసీ ఈ ఆరోపణలపై స్పందించాలని కోరారు.

# హుగ్లీలో టెన్షన్ టెన్షన్

# టీఎంసీ ఎమ్మెల్యే కారుపై కోడి గుడ్లు, రాళ్లతో దాడి

బంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి తర్వాత మమతా బెనర్జీ వర్గం నేతలకు వరుసగా చేదు అనుభవాలు ఎదురవుతున్నాయి. హుగ్లీ జిల్లాలో టీఎంసీ అగ్రనాయకురాలు మమతా బెనర్జీ ఏర్పాటు చేసిన బహిరంగ సభకు హాజరయ్యేందుకు సెరాంపుర్‌కు వెళ్తున్న టీఎంసీ ఎమ్మెల్యే కునాల్ ఘోష్ కారుపై మూక దాడి జరిగింది. ఆయన ప్రయాణిస్తున్న వాహనంపై నల్ల జెండాలు పట్టుకున్న కొందరు వ్యక్తులు రాళ్లు, కోడి గుడ్లు విసిరారు. టీఎంసీ, మమత బెనర్జీకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ దాడిలో కునాల్ ఘోష్ స్వల్పంగా గాయపడినట్లు తెలుస్తోంది.

**ఇది జంగిల్ రాజ్ పాలన : కునాల్ ఘోష్**

తనపై జరిగిన దాడిని కునాల్ ఘోష్ ఖండించారు. బీజేపీ పాలనను జంగిల్ రాజ్‌గా అభివర్ణించారు. బీజేపీ నాయకులు తన కారుపై రాళ్లు, కోడి గుడ్లుతో దాడి చేసి రహదారిని దిగ్బంధించారని ఆరోపించారు. తనపై దాడి జరిగిన సమయంలో అక్కడ పోలీసులు ఎవరూ లేరని చెప్పారు. తాను ఇప్పుడు కోల్‌కతాకు తిరిగి వెళ్తున్నానని అన్నారు. తనపై దాడి చేసినవారిపై ఫిర్యాదు చేయడానికి నేరుగా లాల్ బజార్ లేదా భవాని భవన్‌కు వెళ్తానని స్పష్టం చేశారు.

**మిమ్మల్ని ర్యాలీకి వెళ్లకుండా అడ్డుకుంటున్నారు**

తమ పార్టీకి చెందిన ఎమ్మెల్యే కునాల్ ఘోష్‌పై జరిగిన దాడిపై బంగాల్ మాజీ సీఎం మమతా బెనర్జీ స్పందించారు. సెరాంపుర్‌లో జరగనున్న ర్యాలీకి హాజరు కాకుండా అడ్డుకునేందుకు తృణమూల్ కాంగ్రెస్‌లోని తమ వర్గానికి చెందిన నాయకులను గృహ నిర్బంధంలో ఉంచారని ఆరోపించారు. అదే సమయంలో బీజేపీ కార్యకర్తలు సభాస్థలికి వెళ్లే మార్గాన్ని స్వాధీనం చేసుకున్నారని విమర్శించారు. తమ పార్టీ నిర్వహిస్తున్న ర్యాలీకి వెళ్లేందుకు తనను అనుమతించడం లేదని అన్నారు. టీఎంసీ నాయకులు, కార్యకర్తలపై జరుగుతున్న దాడులను పోలీసులు, బీజేపీ ప్రభుత్వం చూసీచూడనట్లు వ్యవహరిస్తోందని తెలిపారు. కునాల్ ఘోష్ ప్రయాణిస్తున్న కారుపై బీజేపీ గుండాలు దాడి చేశారని మండిపడ్డారు.

"సెరాంపుర్ ర్యాలీ కోసం మేము 15 రోజుల ముందే కోర్టు అనుమతి తీసుకున్నాము. అయినా పోలీసులు నన్ను ఇంటి నుంచి బయటకు వెళ్లనివ్వడం లేదు. బీజేపీకి చెందిన అరాచక శక్తులు రోడ్లను దిగ్బంధించాయి. పోలీసులు ఎక్కడా



కనిపించడం లేదు. పైగా వారు ఈ రోడ్లు దిగ్బంధించిన వారికి సహకరిస్తున్నారు. బీజేపీ నాయకుల దాడిలో టీఎంసీ నేత కునాల్ ఘోష్ కారు ధ్వంసమయ్యింది. ఆయనపై కూడా దాడి జరిగింది. మీరే చెప్పండి ఇది ప్రజాస్వామ్యానికి మంచి పరిణామమేనా? నిజంగానే మీకు (బీజేపీనుద్దేశించి) ప్రజల మద్దతు ఉంటే ప్రతిపక్షాన్ని ఎందుకు అణచివేస్తున్నారు? పోలీసులు తమ యూనిఫాం తీసేసి బీజేపీ జెండాను పట్టుకుంటే సరిపోతుంది. ఇలాంటి ఘటనలు ఆకృత్యాలు కిందికి వస్తాయి. ఇలాంటి ఆకృత్యాలు ఆఫ్రికా దేశాలలో కనిపిస్తాయి. బీజేపీ పాలిత ప్రాంతాలైన ఉత్తర్ ప్రదేశ్, బిహార్‌లలో కూడా ఇలాంటి ఘటనలు జరగడం లేదు. నా సెరాంపుర్ ర్యాలీ కోర్టు అనుమతితోనే జరుగుతోంది. ఇది సజావుగా సాగేలా చూడటం పోలీసులు, అధికారుల బాధ్యత. కానీ పోలీసులు అసలేం పట్టించుకోవడం లేదు"

**సువేందుకు కల్యాణ్ బెనర్జీ ఫైర్**

మరోవైపు, టీఎంసీ సీనియర్ నేత కల్యాణ్ బెనర్జీ సైతం బీజేపీపై మండిపడ్డారు. గత రెండు మూడు రాత్రులుగా సెరాంపుర్ ఇన్‌స్పెక్టర్, పోలీసులు ఇంటింటికీ వెళ్లి మమత ర్యాలీకి హాజరైతే అరెస్టు చేస్తామని ప్రజలను బెదిరిస్తున్నారని ఆరోపించారు. శనివారం ఉదయం కూడా రిష్రాలోని 5, 6వ వార్డులలో మైనారిటీ వర్గాలకు చెందిన మహిళలు బయటకు వస్తే అరెస్టు చేస్తామని హెచ్చరించారని అన్నారు. పోలీసు అధికారాలను అత్యంత చురుకుగా దుర్వినియోగం చేస్తున్న వ్యక్తి సెరాంపుర్ ఇన్‌స్పెక్టరేనని విమర్శించారు. సువేందు అధికారి అతన్ని ఎంతకాలం కాపాడగలరో తాను చూస్తానని, ఈ విషయాన్ని హైకోర్టు దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు. సువేందు అధికారి బీజేపీ అంటేనే గూండాయిజం, అరాచకం, పోలీసులను ఇంటి పనివాళ్లగా వాడుకోవడమని నిరూపించారని ఎద్దేవా చేశారు. మరోవైపు, ఇది సామాన్య ప్రజల నిరసన కాదని, బీజేపీ ముందస్తు ప్రణాళికతో చేసిన దాడి అని టీఎంసీ నేత అసిత్ మజుందార్ ఆరోపించారు.

**బీజేపీ ఏమందంటే?**

మరోవైపు, టీఎంసీ సీనియర్ నేత, ఎమ్మెల్యే కునాల్ ఘోష్‌పై జరిగిన దాడిపై బంగాల్‌లో అధికారంలో ఉన్న భారతీయ జనతా పార్టీ స్పందించింది. ఈ ఘటనను ప్రజల నుంచి వచ్చిన స్వచ్ఛంద స్పందనగా అభివర్ణించింది. ఈ మేరకు ఉత్తరపారా బీజేపీ ఎమ్మెల్యే దీపాంజన్ చక్రవర్తి వ్యాఖ్యానించారు.

# సెప్టెంబర్ 30న ఇండి కూటమి పార్టీల కీలక భేటీ!

కేంద్ర ఎన్నికల సంఘంలో సభ్యుల మధ్యే అభిప్రాయ భేదాలు ఉన్నట్లు జాతీయ మీడియాలో కథనాలు రావడం, ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ విధానంపై ప్రతిపక్షాల ఆందోళనల నడుమ ఇప్పుడు ప్రతిపక్ష ఇండి కూటమి కీలక సమావేశానికి సిద్ధమవుతోంది. ముఖ్యంగా చీఫ్ ఎలక్షన్ కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్ తక్షణమే రాజీనామా చేయాలని కాంగ్రెస్ పార్టీ డిమాండ్ చేస్తోంది. ఈ నేపథ్యంలో సెప్టెంబర్ 30న దిల్లీలోని కాన్‌స్టిట్యూషనల్ క్లబ్‌లో ప్రతిపక్ష పార్టీలకు చెందిన నేతలు భేటీ అయ్యే అవకాశం ఉందని తెలుస్తోంది. ఎన్నికల సంఘానికి సంబంధించిన అంశాలు, సర్ ప్రకియపై తమ తదుపరి కార్యాచరణ, సీఈసీని తొలగించాలన్న డిమాండ్‌పై ఈ సమావేశంలో చర్చించే అవకాశం ఉందని సంబంధిత వర్గాల్ని ఉటంకిస్తూ జాతీయ మీడియా పేర్కొంది. ఇక దానికి ముందుగానే సెప్టెంబర్ 29న కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సమావేశమై తమ భవిష్యత్ వ్యూహాన్ని ఖరారు చేయనుంది. మరోవైపు ప్రతిపక్ష పార్టీలు ఇప్పటికే ఈ అంశంపై పరస్పరం సంప్రదింపులు జరుపుతున్నాయి. ఇప్పటికే సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌పై కాంగ్రెస్ నేతృత్వంలోని ఇండి కూటమి అభిశంసన తీర్మానాన్ని ప్రవేశపెట్టే అవకాశాల్ని పరిశీలిస్తున్నాయి. దీనిపై చర్చలు జరుపుతూ, న్యాయ నిపుణుల సలహాలు తీసుకుంటుండగా 1-2 వారాల్లో పార్లమెంట్ ఉభయ సభల్లో (రాజ్యసభ, లోక్‌సభలో) ప్రవేశపెట్టే అవకాశాలు ఉన్నాయి. అంతకుముందు ఈ ఏడాదిలోనే రెండు సార్లు సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌ను తొలగించేందుకు ప్రతిపక్షాలు ఇలాంటి నోటీసుల్ని ప్రవేశపెట్టగా అప్పుడు తిరస్కరణకు గురయ్యాయి. ఇప్పుడు మూడో ప్రయత్నంగా మరోసారి అదే చేయాలని చూస్తున్నాయి.

**సెప్టెంబర్ 29న సీడబ్ల్యూసీ భేటీ**

ఈ పరిణామాల మధ్య కాంగ్రెస్ కూడా ఈ అంశంపై తన వ్యూహాన్ని ఖరారు చేసేందుకు సిద్ధమవుతోంది. సెప్టెంబర్ 29న కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సమావేశం జరగనుంది. ఇక్కడ కూడా సీఈసీ, ా×= వివాదంపై పార్టీ తదుపరి కార్యాచరణను ఈ సమావేశంలో చర్చించే అవకాశం ఉంది. సెప్టెంబర్ 25న కాంగ్రెస్ పార్టీ- దేశవ్యాప్తంగా పలు రాష్ట్రాల్లో విస్తృతంగా నిరసనలు కూడా నిర్వహించింది. సీఈసీ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని పార్టీ నేతలు, కార్యకర్తలు డిమాండ్ చేశారు. సెప్టెంబర్ 30న దిల్లీలో ఇండి కూటమి సమావేశం ఉండొచ్చని సీపీఐ లిబరేషన్ ప్రధాన కార్యదర్శి దీపాంకర్ భట్టాచార్య వెల్లడించారు. ఈ చర్చలు ఇండి కూటమికి మాత్రమే పరిమితం కాకుండా, ఇతర ప్రతిపక్ష పార్టీలు, పౌర సమాజ ప్రతినిధులు, మేధావి వర్గం, సంబంధిత పౌరులను కూడా భాగస్వామ్యం చేయాలని ఆయన కోరారు. 'ఎన్నికల సంఘంలో అంతర్గత విభేదాలు బయటపడిన తర్వాత సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌కు ఆ పదవిలో కొనసాగే నైతిక అర్హత ఏ మాత్రం లేదు. ఓటర్ల హక్కుల్ని కాలరాస్తున్న సర్ ప్రక్రియను నిలిపివేసి, ఆయన రాజీనామా చేయాల్సిందే' అని ఆయన డిమాండ్ చేశారు. వామపక్షాలు సహా మరికొన్ని ప్రతిపక్ష పార్టీలు సీఈసీని తొలగించాలని, ా×= ప్రక్రియను నిలిపివేయాలని డిమాండ్ చేస్తున్నాయి. తృణమూల్ కాంగ్రెస్, సీపీఐ (ఎం) మధ్య బంగాల్‌లో రాజకీయ విభేదాలు ఉన్నప్పటికీ ఎన్నికల సంఘం అంశంలో మాత్రం సమన్వయం కోసం సంప్రదింపులు జరుగుతున్నాయి.

**వివాదానికి కారణమైన 14 అభ్యంతరాల రిపోర్ట్**

ది ఇండియన్ ఎక్స్‌ప్రెస్ ప్రచురించిన ఒక రిపోర్ట్ ఈ తాజా రాజకీయ పరిణామాలకు కేంద్రంగా నిలిచింది. దాని ప్రకారం ఎన్నికల సంఘం కమిషనర్లు సుఖ్‌బీర్ సింగ్ సంధు, వివేక్ జోషి గత 10 నెలల కాలంలో 14 సందర్భాల్లో ఎన్నికల సంఘం నిర్ణయాలు సహా ా×= ప్రక్రియకు సంబంధించిన అంశాలపై అధికారికంగా అభ్యంతరాలు వ్యక్తం చేశారు.

## 'సర్' నోటీసులు..

## అత్యవసరమైతే తప్ప వ్యక్తిగత విచారణకు రానక్కర్లేదు

**ఢిల్లీ:** సర్ ప్రక్రియపై కేంద్ర ఎన్నికల సంఘం కీలక సమావేశం నిర్వహించింది. అంతర్గత విబేధాలు బయటపడిన తర్వాత తొలిసారి జరిగిన భేటీకి సీఈసీ జ్ఞానేశ్‌కుమార్, ఈసీలు సందు, జోషి హాజరయ్యారు. 'సర్'పై కేంద్ర ఎన్నికల సంఘం కీలక నిర్ణయాలు తీసుకుంది. 'సర్'లో అభ్యంతరాలపై నవంబర్ 30 వరకు గడువు పొడిగించింది. నోటీసులు అందుకున్నవారు బీఎల్‌వోను కలవక్కర్లేదని.. బీఎల్‌వోలే ఓటర్లక ఇళ్లకు వస్తారని ఈసీ తెలిపింది. ఎస్ఐఆర్‌లో నోటీసు వచ్చిన వారికి బీఎల్‌వోలు ఇంటికి వచ్చి డాక్యుమెంట్లు తీసుకొని ఈసీఐనెట్‌లో అప్‌లోడ్ చేస్తారు. ఈఆర్వో కార్యాలయానికి వెళ్లాల్సిన అవసరం లేదు. అసాధారణ పరిస్థితుల్లోనే ఆన్‌లైన్ హియరింగ్. కుటుంబ సభ్యుడు కూడా హాజరు కావచ్చు. రాత్రి షెల్టర్లు, కార్మికులు, పేదలు, నిరాశ్రయుల కోసం డీఈవోలు సహాయ కేంద్రాలు, స్పెషల్ క్యాంపులు ఏర్పాటు చేయాలి" అని సీఈసీ పేర్కొన్నారు. "ఎస్ఐఆర్ ఫామ్-6 డిక్లరేషన్‌ను సుప్రీంకోర్టు సమర్థించింది. ఎస్ఐఆర్ కాకుండా ఇతర సమయాల్లో సాధారణ నియమాల ప్రకారం ఫామ్‌లు వాడాలి. ఈసీఐనెట్‌ను సీనియర్ డీఈసీ అధ్యక్షతన కమిటీ సమీక్షిస్తుంది. కొత్త ఐటీ మాడ్యూళ్లు కమిటీ ఆఫ్ ఆఫీసర్స్ ద్వారా ఆమోదం తీసుకోవాలి. ఢిల్లీ క్లెయిమ్స్, అబ్జెక్షన్లు 30 అక్టోబర్ 2026 వరకు, డిస్పోజల్ 30 నవంబర్ 2026 వరకు పొడిగింపు. మహారాష్ట్రలో క్లెయిమ్స్ 12 అక్టోబర్ 2026 వరకు, డిస్పోజల్ 10 నవంబర్ 2026 వరకు పొడిగిస్తున్నాం" అని సీఈసీ తెలిపారు. ఎస్ఐఆర్ 20 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో పూర్తయింది. ఓటర్లు, యువకులు కంటిన్యుయస్ అప్‌డేషన్ ద్వారా పేరు చేర్చుకోవచ్చు. ప్రత్యేక ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్ నిర్వహించాలని సీఈవోలకు ఈసీ ఆదేశించింది. కమిషన్ సమావేశాలకు ముందుగా అజెండా, తర్వాత మినిట్స్ జారీ చేయాలి. అధికారుల ఏపీఏఆర్‌లు ప్రతి సంవత్సరం డిసెంబర్ 31లోపు పూర్తి చేయాలి. విదేశీ పర్యటనలకు కమిషన్ అనుమతి తప్పనిసరి" అని సీఈసీ స్పష్టం చేశారు.

## పార్లమెంట్‌లో ఎస్సీ, ఎస్టీ ఎంపీలకు మరింత సమయం ఇవ్వండి

పార్లమెంట్‌లో ఎస్సీ, ఎస్టీ ఎంపీల గళానికి మరిన్ని అవకాశాలు కల్పించాలని కోరుతూ లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాకు కేంద్ర మంత్రి, ఎన్డీఏ మిత్రపక్ష నేత జితన్ రామ్ మాంజీ ఒక లేఖ రాశారు. పార్లమెంట్‌లో అత్యంత కీలకమైన బిల్లులపై చర్చ జరిగే తరుణంలో, షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగలకు ప్రాతినిధ్యం వహిస్తున్న ఎంపీలకు సభలో మాట్లాడేందుకు మరికొంత అదనపు సమయం కేటాయించాలని ఆయన ఆ లేఖ ద్వారా విజ్ఞప్తి చేశారు. ఢిల్లీలోని తన అధికారిక నివాసంలో ఎన్డీఏ ఎంపీలతో నిర్వహించిన ఒక సమావేశంలో ఈ ప్రధానాంశం చర్చకు వచ్చినట్లు మాంజీ వెల్లడించారు. మధ్యప్రదేశ్‌కు చెందిన బీజేపీ ఎంపీ గజేంద్ర సింగ్ పటేల్ ఈ ప్రస్తావన తెచ్చారని తెలిపారు. తమ సామాజిక వర్గానికి చెందిన ప్రత్యేక సమస్యలు, అంశాలను సభలో వివరంగా ప్రస్తావించేందుకు ఎస్సీ, ఎస్టీ ఎంపీలకు తగినంత సమయం అవసరమని పటేల్ కోరినట్లు మాంజీ తన లేఖలో ప్రస్తావించారు. ఎంపీ గజేంద్ర సింగ్ పటేల్ చేసిన ఈ అభ్యర్థనను సీరియస్‌గా పరిగణించి, తగిన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు అవసరమైతే తగిన ఆదేశాలు జారీ చేయాలని ఆయన స్పీకర్‌ను కోరారు. మరోవైపు, సభలో తమకు అసలు సమయమే కేటాయించడం లేదని తాము అనడం లేదని.. తమ వర్గాల సమస్యలపై మరింత లోతుగా చర్చించేందుకు కేటాయించిన సమయాన్ని మరింత పెంచాలని మాత్రమే కోరుతున్నట్లు ఎంపీ పటేల్ గతంలో ఒక మీడియాతో మాట్లాడుతూ స్పష్టం చేశారు.

## నాగాలాండ్‌లో కల్తీ మద్యం కలకలం



నాగాలాండ్‌లో కల్తీ మద్యం అనుమానిత ఘటనలు కలకలం రేపుతున్నాయి. రెండు రోజుల్లో మద్యం సేవించిన తర్వాత 19 మంది ప్రాణాలు కోల్పోయారు. మొకోక్‌చుంగ్ జిల్లాలో 8 మంది, ట్యూన్‌సాంగ్ జిల్లాలో 11 మంది మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. ఈ ఘటనపై దర్యాప్తు చేసేందుకు ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని (సిట్) ఏర్పాటు చేశారు. అదనపు ఎస్పీ ఐ.బంగ్‌లాంగ్ చాంగ్ నేతృత్వంలో ఈ బృందం పనిచేయనుంది. అనుమానిత కల్తీ మద్యం ఎక్కడి నుంచి వచ్చింది? దాని సరఫరా వెనుక ఎవరున్నారు? అనే అంశాలను సిట్ దర్యాప్తు చేస్తోంది. మద్యం నమూనాలను ఫోరెన్సిక్ పరీక్షల కోసం గువాహటికి పంపించారు. మరణాలకు అసలు కారణం ఏంటో పరీక్షల తర్వాత స్పష్టమవుతుందని పోలీసులు తెలిపారు. కొన్ని ఆధారాలు లభించాయని, అయితే దర్యాప్తు ప్రారంభ దశలో ఉన్నందున వివరాలు వెల్లడించలేమని సీనియర్ ఎస్పీ వెసుప్రా కెజో తెలిపారు. మరణాల నేపథ్యంలో పోలీసులు పలు ప్రాంతాల్లో సోదాలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో 19 మందిని అరెస్టు చేశారు. దాదాపు 3 వేల మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. గుర్తుతెలియని, లేబుల్ లేని లేదా అనుమానిత అక్రమ మద్యాన్ని తాగవద్దని పోలీసులు ప్రజలకు సూచించారు. మద్యం తాగిన తర్వాత తల తిరగడం, చూపు మసకబారడం, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది, స్పృహ కోల్పోవడం వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్య సహాయం తీసుకోవాలని హెచ్చరించారు. నాగాలాండ్‌లో 1990 నుంచి మద్య నిషేధ చట్టం అమల్లో ఉంది.

## 'పండగల సీజన్‌లో బంగారం కొనొద్దు'

అత్యవసరమైతే తప్ప బంగారం కొనుగోళ్లకు దూరంగా ఉండాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ భారతీయులకు మరోసారి విజ్ఞప్తి చేశారు. దేశ విదేశీ మారక ద్రవ్య (ఫారెక్స్) నిల్వలను కాపాడుకునేందుకు ఈ చర్య దోహదపడుతుందని ఆయన సూచించారు. త్వరలో రానున్న ధన్‌తేరస్, దీపావళి వంటి కీలక పండగల నేపథ్యంలో ప్రధాని పిలుపునకు ప్రజల నుంచి ఎలాంటి స్పందన వస్తుందనేది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. ఇరాన్ యుద్ధం కారణంగా ఆర్థిక వ్యవస్థపై ప్రతికూల ప్రభావం పడుతున్న నేపథ్యంలో, 2026 మే నెలలో మోదీ తొలిసారి ఈ విజ్ఞప్తి చేశారు. తాజాగా సెప్టెంబర్‌లోనూ ఆయన ఇదే విషయాన్ని గుర్తుచేశారు. భారత్ తన అవసరాలకు సంబంధించి అత్యధిక శాతం బంగారాన్ని దిగుమతుల ద్వారానే పొందుతోంది. 2026 రెండో త్రైమాసికంలో దేశీయ సరఫరాలో 82 శాతం దిగుమతుల నుంచే లభించింది. దీనివల్ల డాలర్ల రూపంలో చెల్లింపులు పెరిగి, సుమారు 780 నుంచి 785 బిలియన్ డాలర్లుగా ఉన్న ఫారెక్స్ నిల్వలపై ఒత్తిడి పెరుగుతోంది. ప్రధాని విజ్ఞప్తి ప్రభావం ఇప్పటికే కొంతమేర కనిపిస్తోంది. ముఖ్యంగా పట్టణ ప్రాంతాల్లో అనవసర కొనుగోళ్లు తగ్గినట్లు తెలుస్తోంది. ఈ ఏడాది వినాయక చవితి సందర్భంగా బంగారం అమ్మకాల పరిమాణం సుమారు 15 శాతం మేర తగ్గింది. వినియోగదారులు ఎక్కువగా తేలికపాటి ఆభరణాలను ఎంచుకోవడం లేదా పాత బంగారాన్ని మార్చుకోవడం వంటి పద్ధతులకు మొగ్గు చూపుతున్నారు. పండగల సమయంలో బంగారం కొనుగోలు చేయడం అనేది సంప్రదాయం, భావోద్వేగాలతో ముడిపడి ఉంటుందని గ్రోత్‌వైన్ క్యాపిటల్ నిపుణుడు శుభమ్ గుప్తా అభిప్రాయపడ్డారు. ఇప్పటికే తగినంత బంగారం ఉన్నవారు ఈసారి లాంఛనంగా కొద్ది మొత్తంలో కొనుగోలు చేయడం మేలని ఆయన సూచించారు. కేవలం పెట్టుబడి కోసమైతే, భౌతిక బంగారానికి బదులుగా గోల్డ్ ఈటీఎఫ్‌లు లేదా గోల్డ్ మ్యూచువల్ ఫండ్స్ ఉత్తమ ప్రత్యామ్నాయాలని ఆయన వివరించారు. ఏదేమైనా, ప్రధాని పిలుపునకు అసలైన పరీక్ష రాబోయే పండగల సీజన్‌లోనే ఎదురుకానుంది.

# కమ్యూనిస్టులతో దోస్తీ.. జగన్ ప్లాన్ అదేనా..?



ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో ఎప్పుడూ లేని విధంగా ఊహించని పరిణామాలు తెరపైకి వస్తున్నాయి. మొన్నటి వరకు ఒకరిపై ఒకరు తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించుకున్న శత్రు శిబిరాలు, ఇప్పుడు ఒక్కతాటిపైకి వచ్చే సంకేతాలు కనిపిస్తున్నాయి. ముఖ్యంగా, వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి వ్యవహారశైలిలో వస్తున్న ఈ అనూహ్య మార్పులు రాజకీయ విశ్లేషకులను సైతం విస్మయానికి గురిచేస్తున్నాయి. ఇంతకాలం కమ్యూనిస్టు పార్టీలను, ముఖ్యంగా సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణను తీవ్రంగా వ్యతిరేకించిన జగన్, ఇప్పుడు అదే వర్గంతో సాగిస్తున్న మంతనాలు రాష్ట్ర రాజకీయాల్లో హాట్ టాపిక్‌గా మారాయి.
గతంలో ఎన్నడూ లేని విధంగా సీపీఐ నేతలు నేరుగా తాడేపల్లికి వెళ్లి జగన్‌ను కలవడం, రాష్ట్రంలో నెలకొన్న కరువు పరిస్థితులపై ఈ నెల 26న విజయవాడలో నిర్వహించబోయే తమ రౌండ్ టేబిల్ సమావేశానికి ఆహ్వానించడం కేవలం మర్యాదపూర్వక భేటీ మాత్రమే కాదనేది స్పష్టమవుతోంది. ఈ పొత్తుల పరతంత్ర వెనుక జాతీయ స్థాయి 'ఇండియా' కూటమి పెద్దల వ్యూహం ఉందన్న వాదన బలపడుతోంది. ఏపీలో ఒంటరి పోరాటం చేస్తున్న తమ పార్టీకి జాతీయ స్థాయిలో మద్దతు కూడగట్టడంతో పాటు, కాంగ్రెస్ నాయకత్వంలోని కూటమి వైపు జగన్‌ను ఆకర్షించేలా కమ్యూనిస్టులను మధ్యవర్తులుగా మారుస్తున్నారనే చర్చ జరుగుతోంది.
మరోవైపు, కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వంతో ఇప్పటివరకు సత్సంబంధాలు కొనసాగించిన జగన్.. ఇప్పుడు తన వ్యూహాన్ని పూర్తిగా మార్చుకుంటున్నట్లు కనిపిస్తోంది. రాష్ట్రంలో అధికారం కోల్పోయాక, తనపై ఉన్న కేసుల విచారణను, ఈడీ దూకుడును తట్టుకోవడానికి ఆయన ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషిస్తున్నారు. అయితే ఇప్పుడు కమ్యూనిస్టులతో చేతులు కలపడం ద్వారా ఢిల్లీ పెద్దలకు ఒక బలమైన సంకేతం పంపుతున్నారనే విశ్లేషణలు వెలువడుతున్నాయి. అవసరమైతే కాంగ్రెస్ కూటామితో జతకట్టడానికి కూడా వెనుకాడబోమనే సంకేతాలు పంపి, కేంద్రంపై ఒత్తిడి తెచ్చే రాజకీయ బ్లాక్‌మెయిలింగ్ వ్యూహానికి జగన్ తెరతీశారా అనే అనుమానాలు బలపడుతున్నాయి.
ఏదేమైనప్పటికీ, ఈ రాజకీయ మార్పులు కేవలం స్వల్పకాలిక ప్రయోజనాలకే పరిమితం కాకపోవచ్చు. ఒకప్పుడు కాంగ్రెస్ పార్టీతో ఉన్న తీవ్ర విభజనల మచ్చను, సిద్ధాంత వైరుధ్యాలను పక్కనపెట్టి జగన్ వేస్తున్న ఈ అడుగులు భవిష్యత్తులో ఎలాంటి పరిణామాలకు దారితీస్తాయో చూడాలి. ప్రస్తుతానికి బీజేపీని అప్రమత్తం చేయడానికి, జాతీయ స్థాయిలో తన ఉనికిని చాటుకోవడానికి కమ్యూనిస్టులను జగన్ ఒక ఆయుధంగా వాడుకుంటున్నట్లు స్పష్టమవుతోంది. ఈ కొత్త దోస్తీ కేవలం తాత్కాలిక రాజకీయమా లేక రాబోయే ఎన్నికల నాటికి మహా కూటమికి పునాదా అన్నది కాలమే నిర్ణయించాలి.

# రాప్తాడు స్థానిక ఎన్నికల్లో వైసీపీ పట్టెంత.. ?




అనంతపురంజిల్లా రాప్తాడు నియోజకవర్గంలో ఒకప్పుడు వైసీపీ ప్రభావం ఉన్నా.. ఇప్పుడు దాదాపు కనుమరుగైందన్న వాదన వినిపిస్తోంది. గతంలో జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో రాప్తాడు మండల పరిషత్‌లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ భారీ విజయాన్ని నమోదు చేసింది. రాప్తాడు మండల పరిషత్‌కు సంబంధించిన స్థానిక ఎన్నికల ఫలితాలను గమనిస్తే.. రాప్తాడు మండల పరిషత్ ప్రాంతీయ నియోజకవర్గం పరిధిలో మొత్తం 11 స్థానాలు ఉన్నాయి. వీటిలో వైసీపీ ఏకంగా 9 స్థానాలను గెలుచుకుంది.ఎన్నికైన ఈ 11 మంది సభ్యులలో ఏడుగురు మహిళలు కావడం విశేషం. ఇదిలా ఉంటే, 2024 లో జరిగిన సార్వత్రిక అసెంబ్లీ ఎన్నికల్లో మాత్రం రాప్తాడు నియోజకవర్గం నుండి టీడీపీ అభ్యర్థి పరిటాల సునీత విజయం సాధించగా, వైసీపీ అభ్యర్థి తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి ఓటమి పాలయ్యారు. ప్రస్తుతం త్వరలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో ఈ ప్రాంతంలో రాజకీయ సమీకరణాలు వేగంగా మారుతున్నాయి. ముఖ్యంగా గత వైభవాన్ని తిరిగి సాధించేందుకు.. తోపుదుర్తి ప్రయత్నిస్తున్నారు. ఈ క్రమంలోనే మండలాల స్థాయిలో రాజకీయాల వేగం పెంచారు.నియోజకవర్గంలోని అన్ని మండ లాల్లో రాజకీయ సమీకరణాలు వేగంగా మారాయి. రాప్తాడు మండలం రాజకీయ బలాబలాలు: నియోజకవర్గ కేంద్రమైన రాప్తాడులో టీడీపీ కేడర్ బలంగా పుంజుకుంది. ఎమ్మెల్యే పరిటాల సునీత, ఆమె కుమారుడు పరిటాల శ్రీరామ్ ఇక్కడ విస్తృతంగా పర్యటిస్తూ ప్రభుత్వ కార్యక్రమాలను ముందుకు తీసుకెళు తున్నారు. టీడీపీ శ్రేణుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపుతున్నారు.మరోవైపు, తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి నేతృత్వంలోని వైఎస్సార్‌సీపీ వర్గం రైతుల విద్యుత్ సమస్యలపై నిరసనలు తెలుపుతూ కేడర్‌ను కాపాడుకునే ప్రయత్నం చేస్తోంది.రామగిరి: పరిటాల కుటుంబానికి రామగిరి ఒకప్పుడు అత్యంత బలమైన కోట. అయితే, గత కొన్నేళ్లుగా ఇక్కడ తోపుదుర్తి వర్గం కూడా గట్టి పోటీ ఇస్తోంది. ప్రస్తుత పరిస్థితిని గమనిస్తే.. ఇరువర్గాల మధ్య తరచూ స్థానిక వివాదాలు, సవాళ్లు ప్రతిసవాళ్లతో రాజకీయ వాతావరణం ఎప్పుడూ వేడెక్కి ఉంటోంది. కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత టీడీపీ నాయకుల పట్టు ఇక్కడ మళ్లీ పెరిగింది.కనగానపల్లి: ఈ మండలంలో గ్రామ స్థాయి రాజకీయాలు చాలా చురుగ్గా ఉంటాయి. గత ప్రభుత్వ హయాంలో వైఎస్సార్‌సీపీకి మద్దతుగా నిలిచిన పలువురు ద్వితీయ శ్రేణి నాయకులు, కార్యకర్తలు ప్రస్తుతం టీడీపీ వైపు మొగ్గు చూపుతున్నారు. ఆత్మకూరు: ఈ మండలంలో విద్యా, మౌలిక వసతుల కల్పన వంటి స్థానిక సమస్యలపై ఇక్కడ రాజకీయం నడుస్తోంది. ప్రభుత్వ నిధులతో ఇక్కడి పాఠశాలలు, కళాశాలల అభివృద్ధికి టీడీపీ ప్రాధాన్యత ఇస్తుండగా, ప్రతిపక్ష వైఎస్సార్‌సీపీ స్థానిక రైతాంగ సమస్యలపై గళమెత్తుతోంది.చెన్నేకొత్తపల్లి: ఈ మండలంలో ఫ్యాక్షన్ ఛాయలు, పాత రాజకీయ కక్షలు అంతర్గతంగా ప్రభావం చూపుతుంటాయి. దీంతో స్థానిక ఎన్నికల్లోనూ ఈ ప్రభావం పడే అవకాశం ఉందని తెలుస్తోంది. అయితే.. మొత్తంగా రాప్తాడులో టీడీపీ తన సత్తాను మరోసారి నిరూపించుకునే ప్రయత్నం చేస్తుండగా.. వైసీపీ నేత తోపుదుర్తి తన ప్రతిష్ఠను కాపాడుకునే ప్రయత్నంలో ఉన్నారు.

# ప్రతిష్టాత్మకంగా ఎన్నికలు తీసుకుంటున్న జనసేన



ఆంధ్రప్రదేశ్‌లో త్వరలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికలను జనసేనపార్టీ అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. క్షేత్రస్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేయడంతో పాటు, కూటమి భాగస్వామ్య పక్షాలతో పక్కా సమన్వయం కోసం ఐదుగురు సభ్యులతో కూడిన ఒక ప్రత్యేక కమిటీని జనసేన అధినేత, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఏర్పాటు చేశారు. ఎన్నికల వేళ గ్రౌండ్ లెవెల్‌లో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా పక్కా వ్యూహంతో ముందుకు వెళ్లేందుకు ఈ నిర్ణయం తీసుకున్నారుఈ కొత్త కమిటీ ఇప్పటికే జనసేన పార్టీలో క్రియాశీలకంగా ఉన్న 14 మంది సభ్యుల ప్రధాన కమిటీతో కలిసి సంయుక్తంగా పని చేయనుంది. ఈ ఐదుగురు సభ్యుల కమిటీ రాష్ట్రవ్యాప్తంగా క్షేత్రస్థాయిలో విస్తృతంగా పర్యటించనుంది. వివిధ జిల్లాల్లో పార్టీ బలాబలాలు, డివిజన్లు మరియు స్థానిక సంస్థల వారీగా అభ్యర్థుల గెలుపు అవకాశాలు, పొత్తుల సమన్వయంలో ఎదురవుతున్న సవాళ్లపై లోతుగా అధ్యయనం చేసి ఈ ప్రత్యేక టీమ్ ఒక సమగ్ర నివేదికను సిద్ధం చేయనుంది.ఈ కమిటీలు క్షేత్రస్థాయి నుంచి సేకరించి సమర్పించే నివేదికల ఆధారంగా జనసేన అధినేత పవన్ కళ్యాణ్ పార్టీ సీనియర్ నేతలతో కలిసి ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించనున్నారు. ఆ నివేదికల ఆధారంగానే స్థానిక సంస్థల ఎన్నికల్లో జనసేన అనుసరించాల్సిన రాజకీయ వ్యూహాలు, సీట్ల సర్దుబాట్లపై పవన్ కళ్యాణ్ క్యాడర్‌కు దిశానిర్దేశం చేయనున్నారు. మున్సిపల్, కార్పొరేషన్ ఎన్నికల వేళ సీట్ల పంపకాలపై కూటమిలో అంతర్గత చర్చలు నడుస్తున్న తరుణంలో జనసేన ఈ ప్రత్యేక కమిటీని రంగంలోకి దించడం రాజకీయ వర్గాల్లో ప్రాధాన్యత సంతరించుకుంది.స్థానిక సంస్థల ఎన్నికలు జనసేన పార్టీ నాయకత్వానికి ఒక సవాల్ గా మారాయి. ఇన్నాళ్లూ ఓపిక పట్టిన నేతలు ఎంతకాలం నుంచో ఈ ఎన్నికల కోసం కాచుక్కూర్చుని ఉన్నారు. పవన్ కళ్యాణ్ పై అభిమానంతో పార్టీ జెండాను పట్టుకుని వదలకుండా పన్నెండేళ్ల నుంచి చేతబూనిన వారు ఈ ఎన్నికల్లో ఖచ్చితంగా పోటీ చేయాలని భావిస్తున్నారు. పవన్ కళ్యాణ్ కూడా సీట్ల షేరింగ్ లో రాజీ పడబోమని చెప్పడం కొంత ఊరట నిచ్చే అంశమే. అయితే చివరకు సీట్ల షేరింగ్ విషయంలో పవన్ కళ్యాణ్ కు పెద్ద సమస్య గా మారనుంది. సీట్ల షేరింగ్ ఎక్కువ అడిగితే వాటిని ఖచ్చితంగా గెలిపించుకోవాలి. తగ్గించుకుంటే ప్రత్యర్థులే కాకుండా సొంత పార్టీ నేతల నుంచి కూడా ప్యాకేజీ అంటూ కామెంట్స్ చేస్తారు. రాజీ పడకుండా.. రహదారి ఏంటి? అన్నదే పవన్ కళ్యాణ్ ముందున్న ప్రశ్న. ఏ నిర్ణయమైనా పవన్ కళ్యాణ్ కు ఈ ఎన్నికలు పెద్ద సమస్యగా మారాయని చెప్పాలి. ఆంధ్రప్రదేశ్ స్థానిక సంస్థల ఎన్నికల్లో సీట్ల సర్దుబాటు విషయంలో జనసేన అధినేత, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ చాలా స్పష్టమైన, దూకుడు వైఖరిని ప్రదర్శిస్తున్నారు. కాకినాడలో జరిగిన పార్టీ కీలక సమావేశంలో ఆయన చేసిన వ్యాఖ్యలు కూటమి రాజకీయాల్లో పెద్ద చర్చకు దారితీశాయి.ప్రపంచ పటాలు పరిశీలించండి 2024 అసెంబ్లీ ఎన్నికల సమయంలో బీజేపీని కూటమిలోకి తెచ్చే క్రమంలో టీడీపీ అభ్యర్థన మేరకు జనసేన సీట్లు తగ్గించుకుంది. కానీ, స్థానిక సంస్థల ఎన్నికల్లో మళ్లీ సీట్లు తగ్గిస్తామంటే ఒప్పుకునేది లేదని పవన్ కళ్యాణ్ తేల్చి చెప్పారు. చేసిన త్యాగాలు చాలని, సీట్ల కేటాయింపులో ఎలాంటి రాజీ పడబోమని స్పష్టం చేశారు. స్నేహపూర్వక పోటీకైనా సిద్ధమని ప్రకటించడం ఇప్పుడు సరికొత్త రాజకీయాలకు తెరలేపినట్లయింది. పొత్తుల లెక్కల్లో భాగంగా ఎక్కడైనా స్థానిక నాయకత్వాల మధ్య ఏకాభిప్రాయం కుదరకపోతే, కొన్ని స్థానాల్లో స్నేహపూర్వక పోటీ కి వెడదామని క్యాడర్‌కు దిశా నిర్దేశం చేశారు. అంటే ఒకరకంగా టీడీపీకి పరోక్షంగా వార్నింగ్ ఇచ్చిన పవన్ కళ్యాణ్ అదే సమయంలో స్థానికంగా కూటమి నేతల మధ్య సయోధ్యను కుదుర్చుకోవాల్సిన బాధ్యత మీదేనంటూ లోకల్ లీడర్లపై పవన్ నెట్టేయడం కూడా ఒక రకంగా చర్చకు దారి తీసింది. ఒకే వార్డులో కూటమిలోని రెండు పార్టీలు పోటీ పడాల్సి వచ్చినా వెనకడుగు వేయొద్దని కార్యకర్తలకు ధైర్యం చెప్పారు. అదే సమయంలో కూటమి ధర్మం పాటించాలని పిలుపు నిచ్చారు. గత ఐదేళ్లలో ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొని నిలబడిన గ్రౌండ్ లెవల్ కార్యకర్తలను, వీరమహిళలను ఈ ఎన్నికల ద్వారా బలోపేతం చేయాలనేది పవన్ ప్రధాన లక్ష్యం. 15 శాతం సీట్లు మాత్రమే జనసేనకు ఇస్తారంటూ వస్తున్న ప్రచారాన్ని ఆయన కొట్టిపారేశారు.వంద శాతం స్ట్రయిక్ రేట్ లక్ష్యంగా పనిచేయాలని పార్టీకి బలమున్న ప్రతి చోటా అభ్యర్థులను నిలబెట్టాలని, అసెంబ్లీ ఎన్నికల తరహాలోనే స్థానిక ఎన్నికల్లో కూడా 100 శాతం విజయాల రేటును నమోదు చేయాలనే వ్యూహంతో ముందుకు వెళుతున్నారు.ఎన్నికల సన్నద్ధత, వ్యూహాల కోసం ప్రత్యేక కమిటీని నియమించారు. ప్రచార కమిటీ బాధ్యతలను మంత్రి కందుల దుర్గేష్‌కు అప్పగించారు. మీరు అన్నట్లుగానే పవన్ కళ్యాణ్ తాజా స్పీచ్‌ను బట్టి చూస్తే, స్థానిక సంస్థల ఎన్నికల్లో జనసేన పార్టీ తన ఆత్మగౌరవాన్ని, క్యాడర్ ప్రయోజనాలను పణంగా పెట్టి సీట్ల విషయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ వెనక్కి తగ్గే సూచనలు కనిపించడం లేదు. మరి చివరకు ఏం జరుగుతుందన్నది చూడాలి.

## ఏటీఎంలలో దుర్గమ్మ ప్రసాదం

**విజయవాడ, సెప్టెంబర్ 26** రాష్ట్రంలో మొదటిసారిగా దుర్గమ్మ దేవస్థానంలో ప్రసాదం ఏటీఎంను ప్రయోగాత్మకంగా అందుబాటులోకి తీసుకొచ్చారు. భక్తులు ప్రసాదం కౌంటర్ల వద్ద గంటల తరబడి క్యూలైన్లలో వేచి ఉండే శ్రమ లేకుండా లడ్డూ ప్రసాదాన్ని పొందేందుకు ఈ ఆధునిక సాంకేతికత ఎంతో దోహదపడుతుందన్నారు దేవాదాయశాఖ కమిషనర్ శ్రీ రామచంద్ర మోహన్. ఖూ× ద్వారా డిజిటల్ చెల్లింపులు జరిపి క్షణాల్లో ప్రసాదం పొందేలా రూపొందించారు. ప్రస్తుతం ట్రయల్ రన్ గా ఏర్పాటు చేశామని..పనితీరు పరిశీలించిన తర్వాత భక్తుల రద్దీ అధికంగా ఉండే ఇతర ప్రాంతాల్లోనూ మరిన్ని యంత్రాలు ఏర్పాటు చేసే అంశాన్ని పరిశీలిస్తాం అన్నారు. ఉత్సవాల రద్దీ సమయంలోనే కాదు సాధారణ రోజుల్లోనూ సులువుగా లడ్డూ ప్రసాదం పొందొచ్చన్నారు. మరోవైపు ఫేక్ పూజా టికెట్ల విషయంలో అప్రమత్తంగా ఉండాలని దళారులను నమ్మి మోసపోవద్దని సూచించారు దేవాదాయశాఖ కమిషనర్ శ్రీ కె. రామచంద్ర మోహన్. దేవాలయ దర్శనాలు, సేవల పేరిట దళారుల ప్రమేయాన్ని ఉపేక్షించేది లేదన్నారు. విజయవాడలో ఇటీవల వెలుగుచూసిన ఫేక్ పూజా టికెట్ల వ్యవహారంపై దేవస్థానం అధికార యంత్రాంగం తక్షణమే అప్రమత్తమై పోలీసులకు ఫిర్యాదు చేసిందని, బాధ్యులపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఆలయ సేవలను కేవలం ప్రభుత్వం, దేవస్థానం అధికారికంగా ఏర్పాటు చేసిన వెబ్‌సైట్లు, డిజిటల్ యాప్‌లు , అధీకృత కౌంటర్ల ద్వారా మాత్రమే పొందాలని సూచించారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకుని పారదర్శకంగా సేవా టికెట్లు పొందాలని, దళారులను ప్రోత్సహించవద్దన్నార.ఇంద్రకీలాద్రిపై దసరా శరన్నవరాత్రుల మహోత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహించేందుకు దేవస్థానం ఆధ్వర్యంలో ఏర్పాట్లు ముమ్మరంగా సాగుతున్నాయని చెప్పారు దేవాదాయశాఖ కమిషనర్ కె. రామచంద్ర మోహన్. రాష్ట్రం నలుమూలల నుంచే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి తరలివచ్చే లక్షలాది భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా సమగ్ర కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేస్తున్నామన్నారు. సామాన్య భక్తునికే అగ్రస్థానం కల్పించే దిశగా ప్రతి విభాగం సమన్వయంతో పనిచేస్తోందని పేర్కొన్నారు. రద్దీ నియంత్రణ, క్యూలైన్ల నిర్వహణ, తాగునీరు, ప్రసాద వితరణ, భద్రత తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు. ఎండ, వర్షాల బారిన పడకుండా షెడ్ల నిర్మాణం, నిరంతర పర్యవేక్షణకు ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు. అమ్మవారి దర్శనం కోసం వచ్చే ప్రతి ఒక్కరూ ప్రశాంతంగా దర్శనం చేసుకుని వెళ్లేలా ప్రణాళికలు రూపొందించామని, ఉత్సవాలను విజయవంతం చేసేందుకు భక్తులందరూ అధికార యంత్రాంగానికి పూర్తి సహకారం అందించాలని కోరారు.

## అంబటి రాంబాబును వెంటాడుతున్న ఈడీ..!

**గుంటూరు సెప్టెంబర్ 26**
వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో జరిగినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న ఏపీ మద్యం రవాణా టెండర్ల కుంభకోణం కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ దర్యాప్తును మరింత వేగవంతం చేసింది. ఈ కేసు దర్యాప్తులో భాగంగా వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత, మాజీ జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబుకు ఈడీ అధికారులు నోటీసులు జారీ చేశారు. హైదరాబాద్‌లోని ఈడీ ప్రాంతీయ కార్యాలయంలో జరిగే విచారణకు హాజరు కావాలని అధికారులు ఆయనకు స్పష్టం చేశారు.మద్యం రవాణా కేసులో అంబటి రాంబాబును విచారణ సెగ గట్టిగానే వెంటాడుతోంది. ఈ వ్యవహారంలో ఈడీ అధికారులు ఇప్పటివరకు ఆయనకు రెండుసార్లు నోటీసులు జారీ చేశారు. మొదటగా సెప్టెంబర్ 18న అంబటి రాంబాబుకు తొలిసారిగా ఈడీ నోటీసులు వెళ్లాయి. సెప్టెంబర్ 24న తమ ముందు హాజరుకావాలని అధికారులు అందులో పేర్కొన్నారు. అయితే ఆ సమయంలో తాను ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నానని, పాత తేదీలతో ఉన్న నోటీసులు పంపారంటూ అంబటి రాంబాబు పేర్కొన్నారు.చట్టపరమైన సలహా తీసుకునేందుకు వీలుగా తనకు కొత్త నోటీసు ఇవ్వాలని ఆయన కోరారు. అంబటి రాంబాబు అభ్యర్థన మరియు మునుపటి గడువు ముగిసిన నేపథ్యంలో, ఈడీ అధికారులు సెప్టెంబర్ 24న మరోసారి నోటీసులు జారీ చేశారు. సెప్టెంబర్ 25న ఉదయం 10.30 గంటలకు హైదరాబాద్‌లోని ఈడీ కార్యాలయంలో విచారణకు హాజరు కావాలని అధికారులు స్పష్టం చేశారు. మద్యం డిపోల నుండి షాపులకు మద్యం రవాణా చేసే కాంట్రాక్టును దక్కించుకున్న కొంతమంది వైఎస్సార్‌సీపీ నేతలతో మాజీ మంత్రికి అత్యంత సన్నిహిత సంబంధాలు ఉన్నాయనే ఆరోపణలు వచ్చాయి.ఒకవేళ విచారణ పేరిట ఈడీ కఠిన చర్యలు తీసుకోవడం గానీ, అరెస్టు చేయడం గానీ చేస్తే.. దాన్ని రాజకీయ కక్షసాధింపుగా చిత్రీకరించి విక్టిమ్ కార్డ్ ఉపయోగించాలనేది ఆయన ఆలోచనగా కనిపిస్తోంది. కేంద్రంలో ఉన్న పవర్, విచారణ సంస్థల వద్ద లభించిన దస్త్రాల ఆధారంగా చట్టపరంగా ముందుకెళ్తున్న ఈడీపై ఇలా రాజకీయ రంగు పూయడం ద్వారా కేసు తీవ్రతను తగ్గించేందుకు ప్రయత్నిస్తున్నారు. అయితే, రాజ్యాంగబద్ధమైన కేంద్ర దర్యాప్తు సంస్థల పనితీరును, వారి వద్ద ఉన్న పక్కా మనీ-ట్రయల్ ఆధారాలను తక్కువ అంచనా వేయడం వల్లే అంబటి ఈ తరహా గేమ్స్ ఆడుతున్నారనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.ఆరోగ్య నెపంతో సమయం దాటవేసే రాజకీయాలు ఎంతో కాలం నిలబడవు. బ్యాంకు లావాదేవీలు, డిజిటల్ సాక్ష్యాలు, బినామీల వాంగ్మూలాలు ఇప్పటికే ఈడీ చేతిలో ఉన్నందున తప్పించుకునే ప్రయత్నాలు ఆయనకు మరిన్ని చిక్కులు తెచ్చిపెట్టే అవకాశాలు ఉన్నాయి. ఈడీ బిగించే ఆర్థిక చక్రబంధం ముందు రాజకీయ ప్రదర్శనలు, ప్రెస్ మీట్లు పనిచేయవని, చట్టబద్ధమైన ప్రక్రియకు హాజరై తన తాను చెప్పే 90 ఎంఎల్ కథలు నిరూపించుకోకపోతే టెండర్ల నిబంధనలను ఉల్లంఘించి, ప్రభుత్వం నిర్దేశించిన రవాణా రేట్లను భారీగా పెంచడం ద్వారా కోట్ల రూపాయల నిధులు దారిమళ్లాయనే కోణంలో దర్యాప్తు జరుగుతోంది. ఈ క్రమంలోనే గత కొన్ని సంవత్సరాలుగా జరిగిన వ్యక్తిగత బ్యాంక్ లావాదేవీల వివరాలు, ఆస్తుల పత్రాలతో సహా విచారణకు రావాలని ఈడీ అధికారులు అంబటి రాంబాబును ఆదేశించారు. ఇప్పటికే ఈ కేసులో పలువురు కీలక వ్యక్తులను అరెస్ట్ చేసిన ఈడీ, అంబటి రాంబాబు విచారణ ద్వారా మరిన్ని కీలక రహస్యాలను ఛేదించాలని భావిస్తోంది.

## కొత్త జెన్ జీ ఓటర్లు....మూడు కోట్ల మంది

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 26,** కేంద్ర ఎన్నికల సంఘం (ఈసీ) 2025లో 'స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్' ప్రక్రియను ప్రారంభించినప్పటి నుంచి 18 నుంచి 28 ఏళ్ల వయస్సు గల ( కేటగిరీకి చెందిన దాదాపు 2.73 కోట్ల మంది కొత్తగా ఓటర్ల జాబితాలో చేరినట్లు అధికారులు వెల్లడించారు. వార్షిక సమగ్ర సమీక్ష నిర్వహించకపోవడం వల్ల యువ ఓటర్ల నమోదు నిలిచిపోయిందంటూ వస్తున్న కథనాల నడుమ ఈ గణాంకాలు వెలువడ్డాయి. అయితే, ఈ ప్రచారానని ఈసీ అధికారులు ఖండించారు. వార్షిక సమీక్షతో సంబంధం లేకుండా అర్హులైన పౌరులు నిరంతరం తమ పేర్లను నమోదు చేసుకునేందుకు 'సబ్‌స్క్రిప్షన్ పద్ధతి/ కంటిన్యూ అప్‌డేట్' అందుబాటులో ఉందని స్పష్టం చేశారు.ఈ 2.73 కోట్లలో తొలిసారి ఓటు హక్కు పొందిన వారితో పాటు, ఇప్పటికే అర్హత ఉండి ఇటీవల జాబితాలో చేరిన లేదా వివరాలను అప్‌డేట్ చేసుకున్న 18-28 ఏళ్ల మధ్య యువకులు కూడా ఉన్నారని తెలిపారు. "ప్రజా ప్రాతినిధ్య చట్టం 1950, సెక్షన్ 14లో 2021లో చేసిన సవరణ ప్రకారం ఓటర్ల జాబితాలో పేరు లేనివారు లేదా జనవరి 1, ఏప్రిల్ 1, జులై 1, అక్టోబర్ 1 నాటికి 18 ఏళ్లు నిండే ప్రతి పౌరుడూ ఎలాంటి సమీక్ష ప్రక్రియ కోసం వేచి చూడాల్సిన అవసరం లేకుండానే నిరంతర అప్‌డేట్ విధానం ద్వారా పేరు నమోదు చేసుకోవచ్చు. స్పెషల్ సమరీ రివిజన్ , స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ రెండూ సెక్షన్ 21(3) కింద చేపట్టే ఆప్షన్ ప్రక్రియలు మాత్రమే.
ఈ రెండింటినీ ఒకేసారి నిర్వహించాలనే చట్టబద్ధమైన నిబంధనేదీ లేదు" అని అధికారులు వివరించారు. ప్రజా ప్రాతినిధ్య చట్టంలోని సెక్షన్ 14(బీ)కి చేసిన సవరణ తర్వాత ఈ నాలుగు అర్హత తేదీలను అందుబాటులోకి తెచ్చారు. ఈ నాలుగు తేదీలలో ఏ రోజైనా 18 ఏళ్లు పూర్తి చేసుకునే పౌరులు ముందుగానే 'ఫారం 6' ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు. దరఖాస్తుదారుడికి అర్హత వయస్సు వచ్చే త్రైమాసికంలో ఆ దరఖాస్తును పరిశీలిస్తారు.తుది ఓటర్ల జాబితా ప్రచురణ తర్వాత కూడా నిరంతర అప్‌డేట్ ప్రక్రియ కొనసాగుతుందని, కాబట్టి తదుపరి సమీక్ష వరకు ఆగాల్సిన పనిలేదని ఎన్నికల సంఘం తెలిపింది. కొత్త ఓటరు నమోదు కోసం 'ఫారం 6'ను కేటాయించారు.బిహార్‌లోని ఎస్ఐఆర్ ప్రక్రియ తర్వాత నవంబర్ 2025లో అక్కడ అసెంబ్లీ ఎన్నికలు జరిగాయి. అలాగే ఈ ఏడాది అసోం, కేరళ, తమిళనాడు, పశ్చిమ బెంగాల్, పుదుచ్చేరిలలో కూడా ఓటర్ల జాబితా సవరణ పూర్తి చేసి అసెంబ్లీ ఎన్నికలను నిర్వహించారు. ఎస్ఐఆర్, ఎస్ఎస్ఆర్, నిరంతర అప్‌డేట్ అనేవి వేర్వేరు ప్రక్రియలని ఈసీ స్పష్టం చేసింది. ఎస్ఐఆర్ సమయంలోనూ 18-28 ఏళ్ల వయస్సు వారిలో 2.73 కోట్ల మంది కొత్తగా చేరడం యువ ఓటర్ల నమోదు ఆగిపోలేదనడానికి నిదర్శనమని అధికారులు పేర్కొన్నారు.

RNI:APTEL/2023/87729

## సంపాదకీయం

# మౌనం.. ముప్పు!

మౌనం కొన్నిసార్లు మాటల కంటే ఎక్కువ చెబుతుంది. కానీ ఒక సంస్థపై నీలినీడలు కమ్ముకున్నప్పుడు, మౌనం ఒక శూన్యతను సృష్టిస్తుంది. ఆ శూన్యతను ఊహాగానాలు, అనుమానాలు, పరస్పర విరుద్ధ కథనాలు వెంటనే నింపేస్తాయి. మాజీ ప్రధాని పీవీ నరసింహారావును "మౌనం ఒక రాజకీయ వ్యూహం" అనే నమ్మకంతోనే తరచూ గుర్తుచేసుకుంటారు. ఆయన తక్కువగా మాట్లాడేవారు, ఎక్కువగా ఆలోచించేవారు. అది రావు రాజకీయ తత్వానికి, పాలనా శైలికి సరిపోయి ఉండవచ్చు. కానీ భారత ఎన్నికల సంఘం (ఈసీఐ)పై ప్రశ్నలు తలెత్తుతున్న తరుణంలో, ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ)కి అది వ్యూహం కాకూడదు. ఎన్నికల ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర పునఃసమీక్ష (ఎస్ఐఆర్)పై ఇద్దరు ఎన్నికల కమిషనర్లు సుఖ్‌బీర్ సింగ్ సంధు, వివేక్ జోషి.. పదినెలల వ్యవధిలో కనీసం 14 సార్లు అభ్యంతరాలు వ్యక్తం చేసినట్టు సెప్టెంబర్ 23న 'ది ఇండియన్ ఎక్స్‌ప్రెస్' ప్రచురించిన పరిశోధనాత్మక కథనం వెల్లడించింది. దీంతో ఏర్పడిన రాజకీయ దుమారంలో, ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్‌కుమార్ మౌనం ప్రతిపక్షానికి బలమైన అస్త్రంగా మారింది. కానీ అంతకుమించి ముఖ్యమైనది.. స్వేచ్ఛాయుత, నిష్పక్షపాత ఎన్నికలు నిర్వహించే బాధ్యత కలిగిన ఒక రాజ్యాంగ సంస్థ విశ్వసనీయతపైనే ఇది ప్రశ్నలు రేకెత్తిస్తోంది.

కథనం యువ రిపోర్టర్ రాసిందని, దాని ప్రామాణికతనే ప్రశ్నిస్తూ బీజేపీ ప్రతినిధులు పలు వివరణలు ఇచ్చారు. ఇలాంటి స్పందనలను భయాందోళనగానో, అసలు అంశం నుంచి దృష్టి మరల్చే ప్రయత్నంగానో చూడొచ్చు. కానీ ఏదీ కూడా, ఈసీఐ నుంచి వచ్చే అధికారిక వివరణకు ప్రత్యామ్నాయం కాదు. ఈ వివాదం వెలుగులోకి వచ్చి మూడు రోజులు దాటినా, ఇతర ఇద్దరు కమిషనర్లతో కలిసి సంయుక్త విలేకరుల సమావేశం నిర్వహించి విషయాన్ని పరిష్కరించాల్సిన అవసరం సీఈసీకి కనిపించలేదు.

నిజమే, స్పష్టీకరణ ఇచ్చినా ప్రతిపక్షం సంతృప్తి చెందకపోవచ్చు. రాజకీయ పార్టీలు ఎప్పుడూ మరో వాదనను వెతుక్కోగలవు. అదే రాజకీయం. కానీ సంస్థలు మాత్రం, ప్రతి వివరణనూ ఎవరో ఒకరు సవాలు చేస్తారన్న అంచనాతో పనిచేయలేవు. వాస్తవాలను రికార్డులో ఉంచాల్సిన బాధ్యత వాటిపై ఉంది. కథనం వాస్తవానికి విరుద్ధమైతే, ఈసీఐ దాన్ని స్పష్టంగా చెప్పాలి, అవసరమైతే న్యాయపరమైన చర్య తీసుకోవాలి. ఇలాంటి పరిస్థితుల్లో మౌనం గందరగోళాన్ని పరిష్కరించదు, దాన్ని మరింత పెంచుతుంది. ఎన్నికల సంఘం ఎంత ఎక్కువ కాలం మౌనంగా ఉంటే, రాహుల్ గాంధీ నడిపిస్తున్న "ఓటు చోరీ", "సంస్థ చోరీ" కథనానికి బలం చేకూర్చే అవకాశం ప్రతిపక్షానికి అంత ఎక్కువగా లభిస్తుంది. 2027లో పలు రాష్ట్రాల్లో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో, రాజకీయ ఉష్ణోగ్రత మరింత పెరగనుంది. అందుకే రాజ్యాంగ సంస్థ నుంచి స్పష్టత రావడం మరింత ప్రాధాన్యతను సంతరించుకుంటుంది. ఈ వివాదానికి మరో కోణం కూడా ఉంది. మౌనం వీధి రాజకీయాలను కూడా ప్రోత్సహిస్తుంది. నిరసనలు తెలిపే, సీఈసీ రాజీనామాను డిమాండ్ చేసే ప్రజాస్వామిక హక్కు ప్రతి సంఘానికీ ఉంది. కానీ నిరసనలు సంస్థలకు ప్రత్యామ్నాయం కాలేవు, వీధి సమీకరణ ద్వారా రాజ్యాంగ సంస్థలు ఎలా పనిచేయాలో నిర్దేశించడమూ సరికాదు.

అయితే, మోదీ ప్రభుత్వం ఎప్పుడూ తప్పులు చేయలేదని, దాని విధానాలన్నీ విమర్శలకు అతీతమని దీని అర్థం కాదు. బలమైన ప్రజాస్వామ్యానికి బలమైన ప్రతిపక్షం అవసరం. అసలు సమస్య ఏమిటంటే, ప్రతిపక్షానికి "దర్బారీలు" కాదు, మరింత విశ్వసనీయమైన రాజకీయ వ్యూహం, పరిణతి చెందిన నాయకత్వం అవసరం. సీఈసీని తొలగించాలన్న రాహుల్ గాంధీ వాదన సహేతుకమైన రాజకీయ వైఖరే. కానీ 2014 నుంచి బీజేపీ అధికారంలో ఉండటానికి కారణం కేవలం "ఓటు చోరీ" మాత్రమేనన్న వాదనకు వచ్చేసరికి ఈ చర్చ బలహీనపడుతుంది. చరిత్ర మరింత సంక్లిష్టమైన చిత్రాన్ని చూపిస్తుంది. ఎమర్జెన్సీ సమయంలో డీకే బారువా చేసిన ప్రసిద్ధ ప్రకటన "ఇందిరే ఇండియా, ఇండియానే ఇందిర" ఇందుకు ఒక ఉదాహరణ. ఆనాటి ప్రతిపక్షం, సంస్థలపై, దర్యాప్తు సంస్థలపై కాంగ్రెస్ ప్రభుత్వాలు అధిక నియంత్రణ చెలాయిస్తున్నాయని ఆరోపించింది. కాబట్టి ఈ ప్రశ్న రెండు వైపులా వర్తిస్తుంది. ఈరోజు సంస్థాగత స్వతంత్రత ముఖ్యమైతే, అప్పుడు కూడా అది అంతే ముఖ్యమైనది. కర్ణాటక, హిమాచల్‌ప్రదేశ్, తెలంగాణలలో బీజేపీ గణనీయమైన ఓటమిని చవిచూసింది. 2024 లోక్‌సభ ఎన్నికల్లో దాని సీట్ల సంఖ్య గణనీయంగా తగ్గింది, అయినప్పటికీ మిత్రపక్షాలతో కలిసి తిరిగి అధికారంలోకి వచ్చింది.

ఎన్నికల రాజకీయాలు ఎప్పటికీ శాశ్వతం కావు. తన ఓటు వాటాను తగినంత విస్తృత ఎన్నికల ఆదేశంగా మార్చుకోవడంలో కాంగ్రెస్ ఇబ్బంది పడుతోంది. దీనికి కారణం ఓటర్లతో అనుసంధానం కావడం, క్షేత్రస్థాయిలో సంఘటితం కావడం, ప్రజా అసంతృప్తిని ఎన్నికల మద్దతుగా మార్చుకోవడంలో ఉన్న సామర్థ్యమే అసలు సవాలు. సాంకేతికత రాజకీయాలకు సహాయపడగలదు, కానీ పవర్‌పాయింట్ ప్రజెంటేషన్లు రాజకీయ సంఘటనను భర్తీ చేయలేవు.

క్షేత్రస్థాయి రాజకీయాలను ఔట్‌సోర్స్ చేయలేం. రాహుల్ గాంధీ నిర్వహించిన 'భారత్ జోడో యాత్ర' ఒక పెద్ద రాజకీయ కసరత్తే, కానీ ఆ సమీకరణ కాంగ్రెస్‌కు నిలకడైన సంస్థాగత బలంగా ఎంతమేరకు మారిందన్నదే ఎన్నికల ప్రశ్నగా మిగిలిపోయింది. యాత్ర తర్వాత మధ్యప్రదేశ్, రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్‌లను కాంగ్రెస్ కోల్పోయింది. దీని నుంచి వచ్చే విస్తృత పాఠం స్పష్టం, ఎన్నికల రాజకీయాలకు కేవలం ప్రచారాలు సరిపోవు, సంస్థ, వ్యూహం, నిరంతర క్షేత్రస్థాయి భాగస్వామ్యం అవసరం. అన్నింటికీ మించి ఓటర్లు ముఖ్యం. సంస్థలు అంతకంటే ఎక్కువ ముఖ్యం. అందుకే, తన విశ్వసనీయతపై ప్రశ్నలు తలెత్తుతున్న సమయంలో ఎన్నికల సంఘం సమాచార శూన్యతను భరించలేదు. ఒక రాజ్యాంగ సంస్థ మౌనం ద్వారా బలపడదు. పారదర్శకత ద్వారా, వాస్తవాల ద్వారా, తన నిర్ణయాలు పరిశీలనను తట్టుకోగలవన్న విశ్వాసం ద్వారానే బలపడుతుంది. మౌనం కొన్నిసార్లు రాజకీయ వ్యూహం కావచ్చు. కానీ ఒక సంస్థపై ప్రశ్నలు తలెత్తినప్పుడు, స్పష్టతే మెరుగైన వ్యూహం. ప్రజాస్వామ్యంలో నమ్మకం అనేది ఒకసారి కోల్పోతే, దాన్ని తిరిగి నిర్మించుకోవడం చాలా కష్టం. అందుకే, ఆలస్యం కాకముందే ఎన్నికల సంఘం స్పష్టతతో ముందుకు రావాల్సిన అవసరం ఉంది.

## పనికొచ్చే పలుకు



# నిలకడే.. నిజమైన పవర్

స్క్రోలింగ్ చేస్తున్నప్పుడు మీకో రీల్ కనిపిస్తుంది. ఎవరో ఒక ఏడాదిలోనే కోటీశ్వరుడు అయ్యాడని, మరొకరు మూణ్నెళ్లలోనే సిక్స్ ప్యాక్ సాధించారని. ఈ ఓవర్‌నైట్ సక్సెస్ కథలు చూసిన ప్రతిసారీ, మనలో ఏదో అసంతృప్తి. "నేను చేస్తున్నది సరిపోతుందా? ఇంకా ఎందుకు ఫలితం రావట్లేదు?" అనే ప్రశ్నలు. కానీ నిజం చెప్పాలంటే, ఆ రీల్స్‌లో కనిపించని ఒక వాస్తవం ఉంది. ఆ కోటీశ్వరుడు రాత్రికి రాత్రే పుట్టుకురాలేదు, ఆ సిక్స్ ప్యాక్ వెనుక వందలాది జిమ్ సెషన్లు, వదిలేయాలనుకున్న క్షణాలు దాగి ఉన్నాయి. జీవితంలో నిజంగా నిలబడే విజయాలన్నీ, ఏదోక షార్ట్‌కట్ వల్ల కాదు, నిలకడగా శ్రమించడం వల్లే వస్తాయి.

ఇక్కడే మనం చేసే అతిపెద్ద తప్పు ఏమిటంటే, "కన్సిస్టెన్సీ" అనే మాట వినగానే బోరింగ్‌గా, పాతచింతకాయ పచ్చడి సలహాలా అనిపించడం. కానీ దీన్ని కొంచెం వేరేలా ఆలోచిద్దాం. మీరు ఇన్‌స్టాగ్రామ్‌లో ఫాలో అయ్యే ఏ క్రియేటర్ అయినా తీసుకోండి, వాళ్ల వైరల్ అయిన ఆ ఒక్క వీడియో వెనుక, ఎవరూ చూడని వంద ఫ్లాప్ వీడియోలుంటాయి. తేడా ఏమిటంటే, వాళ్లు ఆ ఫ్లాప్ వీడియో తర్వాత పోస్ట్ చేయడం ఆపలేదు. అదే అసలైన సీక్రెట్. సగం దూరంలో ప్రయత్నాన్ని ఆపేస్తే, ఆ దూరం ఎప్పటికీ దూరంగానే మిగిలిపోతుంది. లక్ష్యానికి కేవలం ఒక్క అడుగు దూరంలో ఆగిపోయినా, పది అడుగుల దూరంలో ఆగిపోయినా.. ఫలితం ఒక్కటే, మీరు గమ్యాన్ని చేరుకోలేదు.

మనం జీవిస్తున్న ఈ కాలం ప్రత్యేకమైనది. ఇన్‌స్టంట్ నూడుల్స్ నుంచి ఇన్‌స్టంట్ మెసేజింగ్ దాకా, ప్రతిదీ వేగంగా జరగాలని కోరుకుంటున్న తరం మనది. ఈ వేగం మంచిదే, కానీ కొన్ని విషయాలు మాత్రం సమయం తీసుకుంటాయి. స్కిల్ నేర్చుకోవడం, సంబంధాలు నిర్మించుకోవడం, ఒక కెరీర్‌ను నిలబెట్టుకోవడం –ఇవేవీ మైక్రోవేవ్‌లో వేడి చేసినట్టు క్షణాల్లో జరిగిపోవు. జీవితం మీపై విసిరే సవాళ్లు కూడా ఇలాగే ఉంటాయి. కొన్నిసార్లు ప్లాన్ చేసినట్టు జరగవు, కొన్నిసార్లు మీరు అనుకున్న దారి మూసుకుపోతుంది. అలాంటప్పుడు వెనక్కి తగ్గకుండా, పరిస్థితులకు అనుగుణంగా మారుతూ ముందుకు సాగడమే అసలైన నైపుణ్యం. ఇది "ఫ్లెక్సిబిలిటీ" అనే మాటకు నిజమైన అర్థం. మీ లక్ష్యాన్ని మార్చుకోకుండా, దానికి చేరుకునే మార్గాన్ని మార్చుకోవడం.

ఇక్కడ ఒక ఆసక్తికరమైన విషయం చెప్పాలి. ఈ "ఆట"లో మీరు రోజూ గెలవాల్సిన అవసరం లేదు. ఒక్క రోజు వర్కౌట్ మిస్ అయినా, ఒక్క రోజు చదువుకోకపోయినా, ఒక్క రోజు ప్లాన్ ప్రకారం జరగకపోయినా.. అది మీ ప్రయాణాన్ని ఆపేయదు. అసలైన ప్రమాదం ఏమిటంటే, ఆ ఒక్క రోజు మిస్ అయినందుకు గిల్టీగా ఫీలై, పూర్తిగా వదిలేయడం. ఫిట్‌నెస్ ట్రైనర్లు చెప్పే ఒక సూత్రం ఉంది, "నెవర్ మిస్ ట్వైస్" (వరుసగా రెండోసారి మిస్ చేయకు). ఒకరోజు తప్పిపోవడం మామూలే, కానీ దాన్ని అలవాటుగా మార్చుకోకపోవడమే ముఖ్యం. ఈ ఆటలో నుంచి తప్పుకోకుండా, ఎన్నిసార్లు తడబడినా మళ్లీ నిలబడి పోరాడటమే అత్యంత కీలకమైన విషయం. ఎందుకంటే, ఆట మధ్యలో వదిలేసినవాడు ఎప్పటికీ ఓడిపోయినవాడిగానే మిగిలిపోతాడు. కానీ ఆటలో ఉన్నవాడికి ఎప్పటికైనా గెలిచే అవకాశం ఉంటుంది.

కాబట్టి, తదుపరిసారి మీకు అలసట అనిపించినప్పుడు, ఫలితాలు కనిపించడం లేదని నిరుత్సాహం కలిగినప్పుడు, ఒక్క విషయం గుర్తుంచుకోండి. మీరు చేస్తున్న ప్రతి చిన్న ప్రయత్నం, కనిపించకపోయినా, ఎక్కడో లెక్కకు వస్తూనే ఉంటుంది. వైరల్ మూమెంట్ల వెనుక కనిపించని కష్టం ఎంత ఉందో, మీ నిశ్శబ్ద నిలకడ వెనుకా అంతే బలం ఉంటుంది. రేపటి మీ విజయం, ఇవాళ మీరు ఆపకుండా వేసిన ఆ ఒక్క అడుగులోనే దాగుంది.

# సుంకాల సంకటం.. దారేది?




అమెరికా కాంగ్రెస్ సెప్టెంబర్ 16న 'లిండ్సే ఓ. గ్రాహం రష్యా–ఇరాన్ ఆంక్షల చట్టం'ను ఆమోదించింది. ఇంతకుముందే ఆగస్టు 7న ఈ బిల్లుకు సెనేట్ భారీ మెజారిటీతో ఆమోదముద్ర వేసింది. తాజాగా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సంతకం చేయడంతో ఇది చట్టంగా మారింది. దీంతో భారత్‌పై వంద శాతం సుంకాలు విధించే అధికారం ట్రంప్‌కు దక్కింది. "భారత్, చైనా తమ వైఖరి మార్చుకోవాలి, ఇతరుల నుంచి చమురు, గ్యాస్‌ను కొనుగోలు చేయాలి" అని ఆంక్షల చట్టం ఆమోదం పొందిన తర్వాత డెమొక్రటిక్ ఎంపీ రిచర్డ్ బ్లూమెంథాల్ బహిరంగంగానే వ్యాఖ్యానించారు. ఈ సుంకాలను ఎప్పుడు, ఎలా విధించాలో నిర్ణయించే విస్తృతాధికారం ఈ చట్టం ద్వారా ట్రంప్‌కు లభించింది. అయితే అమెరికా దిగుమతి చేసుకుంటున్న భారతీయ వస్తువులపై సుంకాలు విధిస్తారో లేదో ఇప్పటికైతే స్పష్టత లేదు. రష్యాతో వాణిజ్య ఒప్పందాల అవకాశాలను ట్రంప్ ప్రభుత్వం కూడా అన్వేషిస్తున్న తరుణంలో, ఈ చట్టం భారత్‌వంటి దేశాలపై ఒత్తిడి పెంచేందుకు ట్రంప్‌కు ఓ ఆయుధంలా మారొచ్చు. రష్యా నుంచి చమురు కొనుగోలు చేస్తున్న దేశాల్లో 2026 ఆగస్టు వరకు చైనా తర్వాత భారత్ రెండోస్థానంలో ఉంది. దీంతో అమెరికా సుంకాలకు ఈ రెండు ఆసియా దేశాలు ఎక్కువగా ప్రభావితం కావచ్చు. డిసెంబర్ 2022 –ఆగస్టు 2026 మధ్య రష్యా ముడి చమురు మొత్తం కొనుగోళ్లలో చైనా వాటా 50 శాతం, భారత్ వాటా 37 శాతంగా ఉంది. బిల్లు ఆమోదం పొందిన తర్వాత భారత విదేశాంగ శాఖ ఒక ప్రకటన విడుదల చేస్తూ, ద్వైపాక్షిక సంబంధాలపైనే కాకుండా అంతర్జాతీయ ఇంధన మార్కెట్‌పైనే ఈ బిల్లు ప్రభావం చూపుతుందనే విషయాన్ని అమెరికా దృష్టికి తీసుకెళ్లినట్టు పేర్కొంది.

జులై 2026 గణాంకాల ప్రకారం భారత్ ముడి చమురు దిగుమతుల్లో 51 శాతం రష్యా నుంచి వస్తున్నవే. హర్మూజ్ జలసంధి నుంచి రాకపోకలకు అంతరాయం ఏర్పడిన వేళ, రష్యాపై ఆధారపడటాన్ని నెల రోజుల్లోనే తగ్గించుకోవడం భారత్‌కు కష్టమే. రష్యానుంచి ఎప్పటిలాగానే చమురు దిగుమతులు కొనసాగిస్తే ట్రంప్ సుంకాల భారాన్ని ఎదుర్కోవాల్సి ఉంటుంది. పోనీ సుంకాల నుంచి బయటపడేందుకు రష్యా నుంచి దిగుమతులు తగ్గించుకుంటే, అమెరికా ఒత్తిడికి తలొగ్గిందనే అభిప్రాయం వ్యక్తమయ్యే అవకాశం ఉంది. హర్మూజ్ జలసంధి ద్వారా చమురు రవాణాకు అంతరాయం ఏర్పడటం, ముడి చమురు బ్యారెల్ ధర 100 డాలర్లకు మించి ఉన్న ఈ పరిస్థితుల్లో, కొత్త సరఫరాదారులను వెతకడం భారత్‌కు ఖర్చుతో కూడుకున్న వ్యవహారంగా మారుతుంది. భారత్ ఎగుమతులపై అమెరికా వంద శాతం సుంకాలు వేస్తే అది మరో పెద్ద దెబ్బ అవుతుంది. ఇప్పుడు ఎగుమతవుతున్న వస్తువుల ధరలు అమెరికాలో రెట్టింపవుతాయి, దీంతో చాలా ఉత్పత్తులు వాణిజ్యపరమైన పోటీని తట్టుకోలేవు. ఒకవేళ ఎవరైనా అమెరికన్ దిగుమతిదారు భారత్ నుంచి 20 డాలర్ల విలువైన దుస్తులను కొనుగోలు చేస్తే, వంద శాతం టారిఫ్ కారణంగా సరిహద్దు వద్దే అదనంగా మరో 20 డాలర్ల రుసుము పడవచ్చు. ఆ తర్వాత వాటికి దేశీయ రవాణా, రిటైల్ మార్జిన్స్, ఇతర పన్నులు కలుస్తాయి. అప్పుడు తక్కువ సుంకం ఉన్న దేశం దిగుమతి చేసే అదే వస్తువుతో భారత్ పోటీ పడాల్సి వస్తుంది. దీంతో తక్షణ ప్రభావం భారతీయ ఎగుమతిదారులు, ఉద్యోగులపై పడుతుంది.

ఈ నేపథ్యంలో భారత్ ఏం చేయాలన్నది కీలక ప్రశ్న. అసమానమైన ద్వైపాక్షిక ఒప్పందంలో మార్పులకు, రష్యా చమురు కొనుగోలు విషయంలో మినహాయింపుల కోసం భారత్ డిమాండ్ చేయవచ్చని దిల్లీకి చెందిన గ్లోబల్ ట్రేడ్ రీసెర్చ్ ఇనిషియేటివ్ (జీటీఆర్ఐ) డైరెక్టర్ అజయ్ శ్రీవాస్తవ అభిప్రాయపడ్డారు. "తాత్కాలిక సుంకాల ఉపశమనం కోసం భారత్ వెనక్కి తగ్గకూడదు, ఇంధన భద్రత విషయంలో రాజీ పడకూడదు. యూరోపియన్ యూనియన్, జపాన్, దక్షిణ కొరియా వంటి కీలక భాగస్వాములతో వాణిజ్య ఒప్పందం చేసుకున్న తర్వాత కూడా అమెరికా సుంకాలు విధించింది. ఇంధన విధానాన్ని నిర్దేశించేలా అమెరికా దిగే సుంకాల బెదిరింపులకు భారత్ తలొగ్గకూడదు" అని ఆయన స్పష్టం చేశారు. తక్కువ ధరకు లభించిన రష్యా ముడి చమురు, భారత్ చమురు దిగుమతి ఖర్చు తగ్గించడానికి, ఇంధన భద్రత బలోపేతానికి, ద్రవ్యోల్బణ నియంత్రణకు సహాయపడింది. ప్రపంచంలో అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రధాన ఆర్థిక వ్యవస్థల్లో భారత్ ఒకటి. ఈ ఆర్థిక సంవత్సరం మొదటి త్రైమాసికంలో భారత జీడీపీ 7.8 శాతంగా నమోదైంది. అమెరికా భారత్‌కు అతిపెద్ద ఎగుమతి మార్కెట్. గత ఆర్థిక సంవత్సరంలో భారత్ 87 బిలియన్ డాలర్ల విలువైన వస్తువులను అమెరికాకు ఎగుమతి చేసింది, ఇది మొత్తం 438 బిలియన్ డాలర్ల ఎగుమతుల్లో 20 శాతానికి సమానం. రష్యా చమురును భారత్ కంటే చైనా ఎక్కువగా కొనుగోలు చేస్తుంది. ఆ దేశం కూడా ఈ కొత్త చట్టం పరిధిలోకి వస్తుంది. మరి భారత్‌పై ఒత్తిడి తెచ్చినట్టే చైనాపై అదే తరహా ఒత్తిడి తెస్తుందా? అన్నది చాలా ముఖ్యమైన ప్రశ్న.

వాణిజ్యపరంగా అమెరికాపై ఆధారపడటాన్ని తగ్గించుకోవడానికి భారత్ యత్నిస్తోంది. దీనికి స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలే మార్గం. అయితే అవి రాత్రికి రాత్రే అమెరికా మార్కెట్‌కు ప్రత్యామ్నాయంగా మారలేవు. భారత్–యూకే సమగ్ర ఆర్థిక, వాణిజ్య ఒప్పందం జులై 15, 2026 నుంచి అమల్లోకి వచ్చింది. దీని ప్రకారం భారత్ ఎగుమతుల్లో 99 శాతం ఎలాంటి సుంకాలు లేకుండానే యూకేలోకి ప్రవేశిస్తాయి. భారత్–ఒమన్ వాణిజ్య ఒప్పందం కూడా అమల్లోకి వచ్చింది, 98.08 శాతం ఎగుమతులకు సుంకాలు లేకుండానే ఒమన్ ప్రవేశం కల్పించింది. భారత్–న్యూజిలాండ్ స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం అక్టోబర్ 20నుంచి అమల్లోకి రానుంది. మరోవైపు జనవరిలో భారత్–యూరోపియన్ యూనియన్ స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందంపై చర్చలు జరిగాయి. దీని ప్రకారం భారత్ ఎగుమతుల్లో 99.5 శాతాన్ని సుంకాలు లేకుండా అనుమతి ఇస్తుంది. ఈ ఒప్పందాలు అమెరికా మార్కెట్‌కు ప్రత్యామ్నాయాలు కాలేవు, కానీ ఇతర ప్రధాన మార్కెట్లలోకి ప్రవేశించే ఖర్చును తగ్గించగలవు. సుంకాల మినహాయింపు మాత్రమే ఈ మార్కెట్లలోకి ప్రవేశాన్ని కల్పించలేదు. భారత్ ఎగుమతిదారులు రవాణా, సరఫరా వ్యవస్థపై పెట్టుబడులు పెట్టాలి, సాంకేతిక, ఉత్పత్తి ప్రమాణాలను పాటించాలి, తమ డిజైన్లను సవరించుకోవాలి, పంపిణీ నెట్‌వర్క్‌ను నిర్మించుకోవాలి. "ఎగుమతి మార్కెట్ విస్తరణకు ఒక పరిమితి ఉంటుంది. ఒక సంస్థ అమెరికాపై ఆధారపడటాన్ని తగ్గించుకోవడానికి 60 శాతం ఎగుమతిని అక్కడ తగ్గించి యూరప్‌లో 60 శాతం పెంచిందని అనుకుంటే, ఇక్కడ భౌగోళికంగా విస్తరించినట్టు అవుతుందే కానీ, వ్యూహాత్మకంగా చేసినట్టు కాదు. మార్కెట్లను విస్తరించాలంటే వినియోగదారుల సంఖ్యను పెంచుకోవాలి" అని అజయ్ శ్రీవాస్తవ చెప్పారు. మొత్తంగా చూస్తే, ఇంధన భద్రతను కాపాడుకుంటూనే, మార్కెట్ వైవిధ్యీకరణను వేగవంతం చేయడం, దృఢమైన దౌత్యనీతితో అమెరికాతో సంభాషణలు కొనసాగించడమే భారత్ ముందున్న సమతుల్య మార్గం. ■



ఒక కొత్త టీమ్‌లో చేరిన ఉద్యోగి, తన ఐడియా తప్పుగా అనిపిస్తుందేమోనని, అందరూ నవ్వుతారేమోనని భయపడి నోరు మెదపడు. కానీ నిజానికి, ఆ ఐడియానే మీటింగ్‌ను మలుపు తిప్పే అవకాశం ఉండొచ్చు. ఇతరులు ఏమనుకుంటారో అన్న భయంతో మాట్లాడకుండా ఉండిపోతే, మీ విలువైన ఆలోచన అలాగే మిగిలిపోతుంది. ఇతరుల అభిప్రాయాలను వినండి, గౌరవించండి - కానీ వాటి ముందు మీ గొంతును తగ్గించుకోకండి. మీకు అనిపించింది నిర్భయంగా చెప్పండి, ఫలితం ఏదైనా సరే.

-మహాదేవ

## వింతల్లో వింతలు

# చేతికి దొరికిన చరిత్ర!!



ఒక్క మెటల్ డిటెక్టర్ పట్టుకుని షికారుకెళ్తే, ఏకంగా చరిత్రే చేతికి దొరికితే? ఫిన్లాండ్‌కు చెందిన కల్లె లప్పినెన్‌కు సెప్టెంబర్ 3న సరిగ్గా ఇదే జరిగింది! హెల్సింకికి 105 మైళ్ల దూరంలోని సిస్మొ గ్రామంలో ఆయనకు 4,000కు పైగా వెండి నాణేలు, వెండి కంకణం, ఇతర ఆభరణాలతో కూడిన భారీ నిధి లభించింది. ఇది ఫిన్లాండ్ చరిత్రలోనే అతిపెద్ద వైకింగ్ యుగం నిధి రికార్డు! స్వీడన్, బ్రిటన్, జర్మనీనుంచే కాక, నేటి టర్కీ, ఇరాన్ ప్రాంతాల నాణేలు కూడా ఇందులో ఉండటం విశేషం. మొత్తం బరువు దాదాపు 10 పౌండ్లు, కాలం 1000–1050 ఏడీ మధ్యదని అంచనా. దీన్ని నిపుణులు 'డబుల్ హోర్డ్' అని పిలుస్తుండగా, తనకే ఆశ్చర్యం కలిగించే స్థాయిలో ఉందని పురావస్తు శాస్త్రవేత్త ఎస్కో టిక్కలా చెప్పారు. నిజంగా అదృష్టమంటే ఇదే కదా!

# ఆసియా క్రీడల్లో భారత్‌కు కబడ్డీ స్వర్ణం




ఆసియా క్రీడలు-2026లో భారత మహిళల కబడ్డీ జట్టు స్వర్ణ పతకాన్ని సొంతం చేసుకుంది. జపాన్‌లోని ఐచి-నాగోయాలో జరిగిన తుది పోరులో ఇరాన్‌ను 37-34 పాయింట్ల తేడాతో ఓడించింది. దీంతో భారత్ ఈ క్రీడల్లో మూడో స్వర్ణ పతకాన్ని ఖాతాలో వేసుకుంది. అలాగే ఆసియా క్రీడల్లో మహిళల కబడ్డీలో భారత్‌కు ఇది నాలుగో స్వర్ణం. టోకై సిటిజన్ జిమ్నాజియంలో జరిగిన ఫైనల్ ఆరంభం నుంచే హోరాహోరీగా సాగింది. తొలి అర్ధభాగం ముగిసే సమయానికి భారత్ 22-16తో ఆధిక్యంలో నిలిచింది. రెండో అర్ధభాగంలో ఇరాన్ పుంజుకుని 18-15తో పైచేయి సాధించినప్పటికీ.. తొలి అర్ధభాగంలో సాధించిన ఆరు పాయింట్ల ఆధిక్యాన్ని భారత్ కాపాడుకుంది. చివరి వరకు ఉత్కంఠగా సాగిన మ్యాచ్‌లో 37-34తో విజయం సాధించి స్వర్ణాన్ని నిలబెట్టుకుంది.

### ఐదు ఫైనల్స్.. నాలుగు స్వర్ణాలు

భారత మహిళల కబడ్డీ జట్టు ఆసియా క్రీడల్లో ఇప్పటివరకు ఐదు సార్లు ఫైనల్‌కు చేరింది. 2010, 2014, 2022తో పాటు తాజాగా 2026లో స్వర్ణ పతకాలు సాధించింది. 2018లో మాత్రం ఇరాన్ చేతిలో ఓడిపోయి రజతంతో సరిపెట్టుకుంది. తాజా విజయంతో భారత్ తన ఆసియా క్రీడల టైటిల్‌ను విజయవంతంగా నిలబెట్టుకుంది. విజయం అనంతరం భారత క్రీడాకారిణులు మైదానంలో సంబరాలు చేసుకున్నారు. జాతీయ జెండాలతో విక్టరీ ల్యాప్ నిర్వహించి ఆనందం వ్యక్తం చేశారు.

# 2027 ప్రపంచకప్‌దే చివరిది.. కోహ్లీ కీలక ప్రకటన

టీమిండియా స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ తన వన్డే కెరీర్‌పై కీలక వ్యాఖ్యలు చేశాడు. 2027లో దక్షిణాఫ్రికా వేదికగా జరగనున్న వన్డే ప్రపంచకప్ తన కెరీర్‌లో చివరి ప్రపంచకప్ కానుందని తెలిపాడు. ఆ టోర్నీలో భారత్‌కు ప్రపంచకప్ అందించి కెరీర్‌ను ఘనంగా ముగించడమే తన లక్ష్యమని పేర్కొన్నాడు. వెస్టిండీస్‌తో వన్డే సిరీస్‌కు ముందు జియోస్టార్‌తో మాట్లాడిన కోహ్లీ ఈ వ్యాఖ్యలు చేశాడు. 50 ఓవర్ల ప్రపంచకప్‌లో ఉండే ఉత్కంఠ, తీవ్రత మరే టోర్నీలోనూ ఉండదని కోహ్లీ చెప్పాడు. ఒకే మ్యాచ్‌లో దాదాపు రెండున్నర టీ20 మ్యాచ్‌లు ఆడినంత శ్రమ ఉంటుందని, విదేశీ గడ్డపై సుమారు పది మ్యాచ్‌ల పాటు ఆ తీవ్రతను కొనసాగించడం శారీరకంగా, మానసికంగా పెద్ద సవాల్ అని వివరించాడు. భారత్ తరఫున తాను ఆడబోయే చివరి ప్రపంచకప్ ఇదేనని, అదే తనకు మరింత ప్రేరణనిస్తోందని కోహ్లీ తెలిపాడు. ప్రపంచకప్ గెలవడమే అంతిమ లక్ష్యమని, అందుకోసం పూర్తి స్థాయిలో శ్రమించేందుకు సిద్ధంగా ఉన్నానని స్పష్టం చేశాడు.వన్డే ప్రపంచకప్‌లలో కోహ్లీకి అద్భుతమైన రికార్డు ఉంది. ఇప్పటివరకు 37 ప్రపంచకప్ మ్యాచ్‌ల్లో 59.83 సగటుతో 1,795 పరుగులు చేశాడు. ఇందులో ఐదు శతకాలు, 12 అర్ధశతకాలు ఉన్నాయి. మొత్తంగా వన్డేల్లో కోహ్లీ 54 శతకాలతో 14 వేలకుపైగా పరుగులు సాధించాడు. మాజీ కెప్టెన్ రోహిత్ శర్మ కూడా రాబోయే ప్రపంచకప్‌పై తన దృష్టి ఉందని చెప్పాడు. తాను ఆడుతున్నంత కాలం కొత్త లక్ష్యాలు ఉంటాయని, ప్రస్తుతం తన ముందున్న లక్ష్యం 2027 ప్రపంచకప్ అని పేర్కొన్నాడు. ఐసీసీ టోర్నీల్లో భిన్నమైన ప్రత్యర్థులు, వేదికలను ఎదుర్కోవాల్సి ఉంటుందని, అందుకు తగిన విధంగా సన్నద్ధం కావాల్సి ఉంటుందని వివరించాడు. భారత్, వెస్టిండీస్ మధ్య మూడు వన్డేల సిరీస్ సెప్టెంబరు 27 నుంచి తిరువనంతపురంలో ప్రారంభం కానుంది. తొలి మ్యాచ్ మధ్యాహ్నం 2 గంటలకు మొదలవుతుంది. ఈ సిరీస్ 2027 ప్రపంచకప్ సన్నాహకాల్లో భాగంగా సాగనుంది.




# స్క్వాష్‌లో అనాహత్ సింగ్ సంచలనం

### ఫైనల్‌కు దూసుకెళ్లిన భారత ప్లేయర్

ఆసియా క్రీడలు-2026లో భారత యువ స్క్వాష్ క్రీడాకారిణి అనాహత్ సింగ్ అదరగొట్టింది. మహిళల సింగిల్స్ విభాగంలో ఫైనల్‌కు చేరి పతకాన్ని ఖాయం చేసుకుంది. సెమీఫైనల్లో జపాన్‌కు చెందిన ఆరో ర్యాంక్ క్రీడాకారిణి సటోమి వటనాబేపై 3-2తో విజయం సాధించింది. 18 ఏళ్ల అనాహత్ సింగ్ సెమీఫైనల్లో ఆరంభంలో తడబడింది. వరుసగా తొలి రెండు సెట్లను కోల్పోయి 0-2తో వెనుకబడింది. అయితే ఆ తర్వాత అసాధారణంగా పుంజుకున్న భారత క్రీడాకారిణి వరుసగా మూడు సెట్లలో ప్రత్యర్థిపై పైచేయి సాధించింది. చివరి వరకు ఉత్కంఠగా సాగిన పోరులో 9-11, 11-13, 12-10, 11-6, 11-3 స్కోరుతో విజయాన్ని అందుకుంది. సెమీఫైనల్లో విజయంతో అనాహత్ సింగ్ ఆసియా క్రీడల్లో తనకు పతకాన్ని ఖాయం చేసుకుంది. ఇప్పుడు ఫైనల్లోనూ విజయం సాధించి స్వర్ణ పతకం సాధించాలనే లక్ష్యంతో బరిలోకి దిగనుంది. తొలి రెండు సెట్ల తర్వాత కూడా ఒత్తిడికి గురికాకుండా పోరాడిన తీరు భారత శిబిరంలో ఉత్సాహాన్ని నింపింది. మరోవైపు భారత జోడీ జోష్నా




చిన్నప్ప, వేలవన్ సెంథిల్ కుమార్ కాంస్య పతకాన్ని సొంతం చేసుకుంది. హాంకాంగ్‌కు చెందిన టాంగ్ మింగ్ హాంగ్, లీ కా యి జోడీతో జరిగిన పోరులో భారత జోడీ 1-2 తేడాతో ఓటమి పాలైంది. 11-10, 2-11, 11-10 స్కోరుతో హాంకాంగ్ జోడీ విజయం సాధించడంతో భారత జోడీకి కాంస్య పతకం దక్కింది.

# ట్రెండీ టాక్: 50 ప్లస్ హీరోలకు 'ఇరుముడి' నేర్పిన పాఠం





సినిమా రంగంలో స్టార్ హీరోల వయసు మారుతున్న కొద్దీ వారి పాత్రల ఎంపికలోనూ పరిణతి రావాల్సిన అవసరం ఎంతైనా ఉందని మరోసారి ప్రూవ్ అయింది. తమ వయసుకు తగిన పాత్రలు చేస్తేనే ఎంత పెద్ద హీరోనైనా ప్రేక్షకులు తెరపై ఆదరిస్తారని.. లేదంటే ప్రేక్షకుల నుంచి ఘోరమైన తిరస్కారం తప్పదని గత పరిణామాలు స్పష్టం చేసాయి. రవితేజ 'ఇరుముడి' ఇప్పుడు బిగ్ డిబేట్ కి కారకం. పెళ్లీడుకొచ్చిన కూతుళ్లు ఉన్నప్పటికీ ఇంకా యువ హీరోయిన్లతో రొమాంటిక్ లవ్‌స్టోరీల్లో నటిస్తున్న 60 ప్లస్ హీరోలకు ఇదొక పెద్ద కనువిప్పు లాంటి పరిణామం. మన పరిశ్రమలో ఉన్న 50 ప్లస్ హీరోలు ఇకపై రొమాంటిక్ పాత్రలను పక్కన పెట్టి.. కథకు బలమైన డాడీ పాత్రల్లో.. బాధ్యతాయుతమైన రోల్స్‌లో నటించాల్సిన సమయం ఆసన్నమైంది.ఇప్పటివరకు ఇద్దరేసి హీరోయిన్లతో ప్రేమలో నిండా మునిగి, రొమాన్స్ చేయడంలో బిజీగా ఉన్న మాస్ మహారాజా రవితేజ ఇటీవల -ఇరుముడి- చిత్రంలో మొదటిసారి కూతురిని అమితంగా ప్రేమించే బాధ్యతాయుతమైన తండ్రి పాత్రలో నటించారు. తెరపై ఆయనలోని ఈ విప్లవాత్మక మార్పును ప్రేక్షకులు ఎంతో మనసారా స్వాగతించారు. కేవలం గ్లామర్ పాత్రలకే పరిమితం కాకుండా కథా బలం ఉన్న తండ్రి పాత్రను ఎంచుకోవడం వల్ల ఆ సినిమా ఘనవిజయం సాధించడమే కాకుండా.. నటుడిగా అతడి మరింత గౌరవాన్ని తెచ్చిపెట్టింది.ఈ విజయంతో 50 ప్లస్, 60 ప్లస్ హీరోలందరూ ఇకపై తమ వయసుకు తగిన పాత్రలనే ఎంచుకోవాల్సి ఉంటుందనే సూచన స్పష్టంగా కనిపిస్తోంది. ఇండస్ట్రీ దిగ్గజ హీరోలైన చిరంజీవి, బాలకృష్ణ, వెంకటేష్‌లు ఇప్పటికే చాలావరకు తమ వయసుకు తగినట్లు పరిణతి ఉన్న విభిన్న పాత్రలను ఎంపిక చేసుకుంటూ దూసుకెళుతున్నారు. నాగార్జున సైతం ప్రయోగాత్మక కంటెంట్‌తో ప్రేక్షకులను అలరిస్తున్నారు. 'ఇరుముడి' తరహాలో భావోద్వేగాలతో కూడిన తండ్రి పాత్రలు ఈ సీనియర్ హీరోలందరికీ కూడా వందశాతం సూటబుల్ ఆప్షన్‌గా మారుతున్నాయి.

అలా కాకుండా పాత పద్ధతిలోనే ఇంకా హీరోయిన్లతో లవ్వాయణాలు, రొమాంటిక్ కామెడీలు చేస్తూ పోతే నేటి ప్రేక్షకులు నిర్ధయంగా తిరస్కరిస్తున్న ఉదాహరణలు చూస్తూనే ఉన్నాం. నేటి మాస్ ఫ్యాన్స్ కూడా ఓటీటీలు, వెబ్ సిరీస్‌లు, హాలీవుడ్ సినిమాలు, లైవ్ సిరీస్ లు విపరీతంగా చూస్తూ పూర్తిగా అప్‌గ్రేడ్ అయ్యారు. వారి అభిరుచులు మారడంతో రొటీన్ కమర్షియల్ ఫార్ములా సినిమాలు బెడిసికొడుతున్నాయి. కేవలం టాలీవుడ్‌లోనే కాకుండా బాలీవుడ్‌లోనూ సల్మాన్ ఖాన్, అమీర్ ఖాన్, షారూఖ్ ఖాన్ వంటి దిగ్గజాలు కూడా గ్లామర్ పాత్రలను పక్కన పెట్టి తమ వయసుకు తగ్గ పరిణతి ఉన్న తండ్రి లాగానో లేదా వయసుకు తగ్గ పాత్రల్లోను నటిస్తుండటం గమనార్హం.మొత్తానికి ఏజ్ పెరుగుతున్న కొద్దీ స్టార్ హీరోలు తమ పంథాను మార్చుకోవాల్సిన టైమ్ వచ్చేసింది. హాలీవుడ్ హీరోల మాదిరిగా మారుతున్న కాలానికి తగినట్లు తమ ఇమేజ్‌ను అప్‌గ్రేడ్ చేసుకుంటూ.. వైవిధ్యమైన పాత్రలతో మైలేజ్ పెంచుకోవడమే సీనియర్ హీరోలకు సరైన మార్గం. కేవలం డ్యాన్సులు, రొమాన్స్ చుట్టూ తిరగకుండా బలమైన భావోద్వేగాలు ఉన్న క్యారెక్టర్లను ఎంచుకుంటేనే బాక్సాఫీస్ వద్ద విజయం సొంతమవుతుందని నిరూపణ అయింది. ఇరుముడి నేర్పిన పాఠం టాలీవుడ్ 50 ప్లస్ హీరోలకు నిజంగానే కలిసి వస్తుందని ఆశిద్దాం.



PENSATTA TELUGU DAILY Printed, Published, Owned by CHITAMANENI ANIL KUMAR, D.NO 1-1, RAJULA ILLA PAKKANA, VENKATAPURAM, THANAM POST, MUNGAPAKA MANDAL, ANAKAPALLI VISHAKAPATNAM, ANDHRA PRADESH 531021 ,Publishe at D.NO 1-1, RAJULA ILLA PAKKANA, VENKATAPURAM, THANAM POST, MUNGAPAKA MANDAL, ANAKAPALLI VISHAKAPATNAM, ANDHRA PRADESH 531021 . And Printed at Chaitanya Vaaradhi printers, Do.No 2-99 Bharanikam, Paravada Anakapalli, Visakhapatnam- 531 021. Editor: CHITAMANENI ANIL KUMAR, D.NO 1-1, RAJULA ILLA PAKKANA, VENKATAPURAM, THANAM POST, MUNGAPAKA MANDAL, ANAKAPALLI VISHAKAPATNAM, ANDHRA PRADESH 531021 , Cell: 99853 15759, RNI. No APTEL/2023/87729, E-mail:anilchinthamneni@gmail.com